





ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

కృష్ణమ్మ.. పరవళ్లు

- నిండిన శ్రీశైలం ఎగువ ప్రాజెక్టులు
- శ్రీశైలానికి 96,369 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు వరదనీరు



జూరాల నుంచి నీటి విడుదల

నరసరావుపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో కృష్ణమ్మ ప్రాజెక్టులను దాటి దిగువకు వడివడిగా వస్తోంది. శ్రీశైలం ఎగువ ప్రాజెక్టులు నిండిపోవడంతో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ శ్రీశైలం దిశగా పరవళ్లు తొక్కుతోంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీవర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం ఎగువున ఉన్న ఆల్‌మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులు నిండాయి. దీంతో వాటి గేట్లు ఎత్తి భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలోకి ఆదివారం 96,369క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో గా వచ్చిచేరుతోంది. ఇది క్రమంగా లక్ష క్యూసెక్కు లు దాటే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న పది రోజుల్లో వంద టీఎంసీలకు పైగా నీరు శ్రీశైలానికి వస్తుందని అంచనా. కృష్ణమ్మకు వరదనీరు పోటెత్తుండటంతో సాగర్ ఆయకట్టులో రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్రలో 105.78 టీఎంసీలకు 74.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రెండు రోజుల్లో దాదాపు 25 టీఎంసీల నీరు చేరింది. వరద ప్రవాహం ఇలానే కొనసాగితే ఒకటి రెండు రోజుల్లో తుంగభద్ర గేట్లు కూడా తెరిచి దిగువకు నీటి విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్‌కు 2,340 కూసెక్కుల నీరు వస్తుంది. తాగునీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 9,882 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తిస్థాయి నీటినిల్వ (టీఎంసీలలో)	ప్రస్తుత నీటినిల్వ (టీఎంసీలలో)	వస్తున్న వరదనీరు (క్యూసెక్కుల్లో)	విడులచేస్తున్న నీరు (క్యూసెక్కుల్లో)
ఆలమట్టి	123.08	96.30	87,217	1,00,064
నారాయణపూర్	33.31	28.90	96,063	1,08,773
జూరాల	9.66	7.04	76,166	84,444
తుంగభద్ర	105.78	74.58	1,12,101	2,464
శ్రీశైలం	215.81	39.15	96,369	నిల్
నాగార్జునసాగర్	312.05	122.52	2,340	9,882
పులిచింతల	45.77	0.82	640	50

బ్యారేజీ నుంచి 12,300 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి టౌన్: ప్రకాశం బ్యారేజి దిగువకు వరదనీటి విడుదల కొనసాగుతోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి బ్యారేజికి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కట్టలేరు, కీసర, తదితర వాగుల నుంచి 13వేల 600 క్యూసెక్కుల వరదనీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా 17 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 12 వేల 300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు.

కౌలు బకాయి.. రూ. 380 కోట్లు

- వైసీపీ నిర్లక్ష్యం.. కూటమి కసరత్తు
- రెండేళ్లుగా అమరావతి రైతుల అవస్థలు
- వాయిదాలతో సరిపెట్టిన వైసీపీ ప్రభుత్వం
- ఈ ఏడాదితో ముగియనున్న పదేళ్ల గడువు
- పునరుద్ధరణ చేయాలంటూ రైతుల వినతులు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బువ్వ పెట్టే భూములను రాజధాని అమరావతి కోసం ఇచ్చి ప్రభుత్వం ఇచ్చే కౌలుపై ఆధార పడి రైతులు జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారికి కౌలు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం అష్టకష్టాలు పెడుతూ వచ్చింది. ఇప్పటికి వైసీపీ ప్రభుత్వం అమరావతి కౌలు బకాయి రూ.380 కోట్లని తేలింది. రైతులకు గత టీడీపీ ప్రభుత్వంలో ఠంచన్‌గా కౌలు చెల్లింపులు జరిగేవి. దీంతో వారు పిల్లల ఫీజులు, ఇతర ఖర్చులకు వినియోగించుకునే వారు. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజధాని అమరావతి రైతులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రాజధానికి భూములు ఇవ్వడమే నేరమన్నట్లుగా వైసీపీ ప్రభుత్వం రైతులను వేధించిందంటే ఆశ్చర్యం కాదు. ఏటా ఇవ్వాల్సిన కౌలు రైతులకు ఇవ్వకుండా వేధిస్తూ వచ్చింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా హైకోర్టు తలుపు తట్టకుండా రైతులకు కౌలు జమ కాలేదంటే వారిపై గత ప్రభుత్వ వేధింపులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. చివరి రెండేళ్లు కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా వైసీపీ ప్రభుత్వం కౌలు ఎగవేతకు పూనుకుంది.

కౌలు రాక అగచాట్లు

రాజధాని కోసం 28,656 మంది రైతులు దాదాపు 34 వేల ఎకరాల భూములు ఇచ్చారు. చిన్న, సన్నకారు రైతుల్లో చాలామంది ఆర్థిక ఇబ్బందులతో రిటర్నబుల్ ప్లాట్లు అమ్ముకోగా వారంతా కౌలుకు అనర్హులయ్యారు. తాజా గణాంకాల ప్రకారం 28,656 మందిలో కేవలం 22,980 మందికి మాత్రమే కౌలు వస్తుంది. వీరిలో 90 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు, ప్రధానంగా దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ, అసైన్డు రైతులే. ఏటా ప్రభుత్వం కౌలు ఆలస్యంగా చెల్లించడంతో ఆయా వర్గాల రైతులు జీవనానికి అప్పులు చేయాల్సి వచ్చింది. గడిచిన రెండేళ్లలో పూర్తిగా కౌలు ఎగవేయడం తో వారు మరింత అప్పుల ఊబిలో కూరుకుపో యారు. కనీసం ఇల్లు గడవడం, పిల్లలకు ఫీజు లు కట్టుకోవడం కూడా వారికి భారంగా తయారైంది. కిందటేడాది అప్పులు చేసి ఫీజు లు కట్టినా, ఈ ఏడాది ఆ అవకాశం కూడా లేకపోవడంతో పిల్లల చదువులు ప్రశ్నార్థకంగా మారాయని సాధారణ రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరుకుంటున్నారు.

కౌలు చెల్లింపులపై కసరత్తు

రాజధాని రైతులకు చెల్లించాల్సిన కౌలు విషయమై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతుల నుంచి కౌలు చెల్లింపులపై వినతులు పెరుగుతున్న నేపథ్యంలో పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణ ఆ దిశగా కసరత్తు మొదలుపెట్టారు. రైతులకు ప్రభుత్వం రూ.380 కోట్ల మేర కౌలు బకాయిలు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. కౌలు బకాయిల అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి నెలాఖరులోగా కౌలు చెల్లించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు రాజధాని రైతు జేఏసీ నేతలు చెబుతున్నారు.

మమ్మల్ని ఆదుకోవాలి



సకాలంలో కౌలు రాక పోవడంతో అప్పులపాలయ్యాం. గడిచిన రెండేళ్లుగా కౌలు ఊసే లేకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. ఇప్పుడు అప్పుపుట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం రైతులకు కౌలు చెల్లించి ఆదుకోవాలి.

\- కాటా అప్పారావు, తుళ్లూరు రైతు

పరిస్థితి దారుణం



మా పరిస్థితి చాలా దారుణంగా ఉంది. పూట గడవడమే కష్టంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే కౌలుతో పిల్లల్ని చదివించుకుంటున్నాం. ఇప్పుడు వారికి ఫీజులు కట్టే పరిస్థితి లేదు. కనీసం తినడానికి కూడా అప్పులుచేయాల్సి వస్తోంది.

\- మేరిగ నాగేశ్వరరావు, అసైన్డ్ రైతు



శోకసంద్రంలో హారిక తల్లి, బంధువులు



జెట్టి హారిక (ఫైల్)

అమెరికా వెళ్లి.. అనంతలోకాలకు

- తెనాలికి చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి
- రోడ్డు ప్రమాదంలో ఒకరు.. ప్రమాదవశాత్తు మరొకరు..
- తమ పిల్లల దేహాలను ఇప్పించాలని తల్లిదండ్రుల వేడుకోలు
- స్పందించిన కేంద్ర మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి మనోహర్

తెనాలి(ఆంధ్రజ్యోతి), తెనాలి రూరల్, జూలై 21: అమెరికాలో ఉన్నత చదువులతో భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలనుకున్న వారి కలలు కల్లలుగా మిగిలాయి. ఉన్నత చదువులతో ఎంతోఎత్తుకు తమ పిల్లలు ఎదుగుతారని ఆశించిన ఆ తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలింది. స్తోమత లేకపోయినా పిల్లలు అమెరికాలో చదువుకుని ప్రయోజకులై తిరిగి వస్తారనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలపై పిడుగులు పడ్డాయి. రెక్కలు ముక్కలు చేసి కూడబెట్టి, మరికొంత అప్పులు చేసి పిల్లల్ని అమెరికాకు పంపగా సంవత్సరం గడిచిందోలేదో వారు అనంతలోకాలకు చేరారని తెలిసి ఆ కుటుంబాలు తీవ్రవిషాదంలో మునిగిపోయాయి. రోజుల వ్యవధిలో అమెరికాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో తెనాలి ఐతానగర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఓ స్విమ్మింగ్‌పూల్‌లో పడి తాడిబోయిన రవితేజ(28) రెండురోజుల క్రితం మరణించగా శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో జెట్టి హారిక(25) మృతిచెందింది. రోజులవ్యవధిలో జరిగిన ఈ ఘటనలతో తెనాలివాసులు విషాదంలో మునిగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఐతానగర్‌కు చెందిన జెట్టి శ్రీనివాసరావు దేవదాయశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగి. ఆయనకు హారికతోపాటు మరో కుమారుడున్నారు. ఇద్దరిలో పెద్దదైన హారిక ఉన్నత చదువుకు అమెరికా పంపారు. సామాన్య కుటుంబమే అయినా కుమార్తె కోరిక తీర్చేందుకు తండ్రి అప్పు చేసి పంపించారు. హారిక యూనివర్సిటీ నుంచి శనివారం కారులో ఇంటికి వెళ్తుండగా లోగాన్ కౌంటీలోని ఒక్లహోమా హైవే పెట్రోల్ -74 దగ్గర వరసగా మూడు కార్లు ఢీకొనడంతో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హారిక అక్కడికక్కడే మరణించింది. ఈ ప్రమాదం శనివారం జరిగితే, ఆదివారం ఉదయం యూనివర్సిటీ నుంచి తమకు సమాచారం అందిందని ఆమె తల్లిదండ్రులు శ్రీనివాసరావు, నాగమణిలు కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు. మృతదేహం గురించి ప్రాధేయపడితే మంచు కారణంగా ఘటనా స్థలికి వెళ్లడం సాధ్యం కావడంలేదని అక్కడున్నవారు చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుమార్తె మృతదేహాన్ని తెనాలి తీసుకొచ్చేందుకు కేంద్ర సహాయమంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, మనోహర్‌లు సహకరించాలని వారు వేడుకున్నారు.

స్విమింగ్‌పూల్‌లో జారిపడి రవితేజ..

తెనాలి ఐతానగర్‌కు చెందిన తాడిబోయిన శ్రీనివాసరావు, జయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. కౌలు రైతుగా ఉన్న శ్రీనివాసరావు ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించటంతో కుటుంబ భారాన్ని తనపై వేసుకున్న తల్లి వ్యవసాయ కూలిపనులు చేసుకుని ఇద్దరు బిడ్డల్ని చదివించింది. స్తోమత లేకపోయినా పెద్దకుమారుడు రవితేజ అమెరికాలో ఎంఎస్ చదువుకుంటానంటే అప్పులుచేసి పంపారు. గత సంవత్సరం అమెరికా వెళ్లిన రవితేజ టెక్సాస్‌లోని ఆస్టిన్ నగరంలో చదువుతూ అక్కడే ఉంటున్నాడు. మూడురోజుల క్రితం మరో మిత్రుడితో కలసి దగ్గర్లోని స్విమింగ్‌పూల్‌కు వెళ్లాడు. పూల్‌లో ప్రమాదవశాత్తు జారి పడిపోయి రవితేజ మృతిచెందాడు. ఈ విషయాన్ని రెండురోజుల తర్వాత అక్కడివారు తెనాలిలోని తల్లికి సమాచారం అందించారు. అప్పటినుంచి రవితేజ తల్లి జయలక్ష్మి కన్నీరుమున్నీరవుతున్నారు. భర్త చనిపోయినా కుమారుడి చదువు ఆగకుండా తాను వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ అమెరికా పంపానని, ఉన్నత చదువులు చదివి తిరిగి వస్తాడనుకుంటే తిరిగిరాని లోకాలకు వెళ్లాడంటూ ఆమె విలపిస్తోంది. మృతదేహాన్ని తెనాలికి తీసుకొచ్చే స్తోమత తమకు లేదని, ప్రభుత్వం సహకారం అందించాలని ఆమె వేడుకున్నారు.

ఆందోళన వద్దు.. ప్రయత్నాలు చేస్తున్నాం

అమెరికాలో మరణించిన విద్యార్థుల మృతదేహాలను తెనాలి తీసుకొచ్చే విషయంలో వారి తల్లిదండ్రుల అభ్యర్థనలపై స్పందించి పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే అమెరికాలోని అధికారులతో మాట్లాడారు. ఇండియన్ కమ్యూనిటీ ప్రతినిధులు, అక్కడే ఉంటున్న తెనాలివాసుల నుంచి పరిస్థితి తెలుసుకున్నారు. స్వదేశానికి మృతదేహాలను తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వారు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి మనోహర్‌లు హారిక తల్లిదండ్రులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. రవితేజ మృతదేహాన్ని కూడా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, ఏ ఇబ్బంది లేకుండా చూస్తామని వారు హామీ ఇచ్చారు.



విషాదంలో రవితేజ తల్లి జయలక్ష్మి



రవితేజ(ఫైల్)

పైసల్లేవు.. పనులెలా?

- పల్లెల్లో కుంటుపడిన పారిశుధ్యం
- వర్షాలతో అధ్వానంగా మారిన దుస్థితి
- కనీసం బ్లీచింగ్ చల్లలేనిస్థితిలో పంచాయతీలు
- 1172 పంచాయతీలకు రావాల్సిన నిధులు రూ.42 కోట్లు

మురుగు.. చెత్త చెదారాలు.. దోమలు.. అపరిశుభ్రత.. తాగునీరు కలుషితం.. డయేరియా.. జ్వరాలతో పడకేసిన పల్లెలు.. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న పల్లెల పరిస్థితి. దీనికితోడు రెండు మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో పంచాయతీల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. బురద.. మురుగు.. అధ్వాన పారిశుధ్యంతో పల్లెజనం అల్లాడిపోతున్నారు. ప్రజల పరిస్థితి ఇలా ఉంటే కనీసం బ్లీచింగ్ చల్లలేని దుస్థితిలో పంచాయతీలు ఉన్నాయి. అపరిశుభ్రత తాండవిస్తున్నా.. కనీస చర్యలు తీసుకునేందుకు అవసరమైన నిధులు లేక పంచాయతీ పాలకవర్గాలు నిస్తేజంగా ఉన్నాయి. ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో అవస్థలు పడుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి పంచాయతీలది. ఆర్థిక సంఘం నిధులు కోసం పంచాయతీలు ఎదురు చూస్తున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) వర్షాలతో గ్రామాల్లో పరిశుభ్రత కుంటుపడింది. రోడ్లపైనే నీరునిలిచి బురదగా మారగా దీనికి చెత్తాచెదారాలు, మురుగు తోడవడంతో పల్లెల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. దోమల వ్యాప్తి ఉధృతమవుతోంది. నిధుల లేమితో పారిశుధ్య పనులు అటకెక్కాయి. ఇదే పరిస్థితులు కొనసాగితే ప్రజలు వ్యాధుల బారినపడే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడనున్నాయి. వైసీపీ పాలనలో ఐదేళ్లు నిధుల్లేక కనీసం పారిశుధ్య పనులను నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొన్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులను మార్చిలో కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసింది. ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కింది. స్థానిక సంస్థల్లో ప్రజల మౌలిక వసతులకు సంబంధించిన పనులను చేపట్టాలని నిధుల వినియోగానికి కేంద్రం మార్గదర్శకాలను విడుదల చేసింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించిన విషయం తెలిసిందే.

నిధుల విడుదలపై కూటమి ప్రభుత్వం ఆశ..

ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఆర్థిక సంఘం నిధుల కోసం పంచాయతీ పాలకవర్గాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని 1172 పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు రూ.42 కోట్లు విడుదల చేయాలి. నిధుల కోసం పాలక వర్గాలు ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి వినతి పత్రాలను అందజేశాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో సాగునీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, వ్యర్థాల నిర్వహణ తదితర పనులకు ప్రాధాన్యం కల్పించాలని అప్పట్లో కేంద్రం ప్రభుత్వం సూచించింది. ఈ పనులు ప్రస్తుతం గ్రామాల్లో తక్షణావసరం. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను తిరిగి పంచాయతీలకు జమ చేయాలని కూటమి ప్రభుత్వ నేతలకు పంచాయతీ పాలకవర్గాలు కోరాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో తాగు నీరు కలుషితం అవుతోంది. డయేరియా ప్రబలే ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. వ్యర్థాల నిర్వహణ లేక పోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. మురుగు కాల్వల పూడిక తీతకు నోచుకోవడంలేదు. దీంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగు, బురదలతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. నిధుల కొరతతో ఆయా పనులు చేపట్టే పరిస్థితులు గ్రామాల్లో కానరావడంలేదు. మున్సిపాల్టీల్లో మురుగు, వరద నీటి కాల్వల్లో పూడికతీత కోసం ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసింది. అదే పనుల కోసం పంచాయతీలకు నిధులు మంజూరు చేయలేదు. కనీసం పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను వెను వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.



గ్రామాల్లో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

జీడబ్ల్యుటీసీఎస్ స్వర్ణోత్సవాలకు రండి

● ఏపీ స్పీకర్, మంత్రులకు అధ్యక్షుడు కృష్ణ లాం వినతి



రాష్ట్ర హోం శాఖా మంత్రి అనితను ఆహ్వానిస్తున్న కృష్ణ లాం

గుంటూరు,జూలై21: అమెరికాలోని తెలుగువారికి సేవలందిస్తున్న గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సంఘం (జీడబ్ల్యుటీసీఎస్) ఏర్పాటై 50 సంవత్స రాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న గోల్డెన్ జూబ్లీ వేడుకలకు రావలసిందిగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖులను జీడబ్ల్యుటీసీఎస్ అధ్యక్షుడు కృష్ణ లాం ఆదివారం స్వయంగా కలసి విజ్ఞప్తి చేశారు. వాషింగ్టన్ డీసీలో వచ్చే సెప్టెంబర్ 27, 28 తేదీల్లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కృష్ణ లాం తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా పలు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, రాజకీయ నాయకులతో ప్రత్యేక కార్యక్ర మాలను ఏర్పాటు చేస్తున్నట్లు కృష్ణ లాం తెలిపారు. ఈ స్వర్ణోత్స వాలకు హాజరై తెలుగువారి ఔన్నత్యాన్ని పెంపొందించడంలో తమతో పాటు రాష్ట్ర ప్రముఖులు రావసిందిగా ఆహ్వానించామన్నారు. రాష్ట్రాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తామని కృష్ణ లాం వివరించారు. తన ఇండియా పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, సినీ దర్శకుడు కొరటాల శివ తదితరులను కృష్ణ లాం కలుసుకుని స్వర్ణోత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. తెలంగాణలోనూ పలువురు ప్రముఖులను కలిసి ఈ వేడుకలకు రావాల్సిం దిగా ఆహ్వానించామని కృష్ణలాం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న దివి లీలామాధవరావు

పింఛన్ల పంపిణీని రేషన్ డీలర్లకు ఇవ్వాలి

● డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పింఛన్ల పంపిణీని వలంటీర్లకు అప్పగించి పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని, కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతను రేషన్ డీలర్లకు అప్పగించాలని, రేషన్‌డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. నామమాత్రపు చార్జీలతో మూడు రోజుల్లో రాష్ట్రమంతటా పంపిణీని పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. ఆదివారం అరండల్‌పేటలో ది గుంటూరు జిల్లా జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం నిర్వ హణదారుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ మళ్లీ వైసీపీ ప్రభుత్వం వచ్చి ఉంటే రేషన్ డీలర్ల వ్యవస్థ అనేది లేకుండా చేసేదేనన్నారు. తమకు రూ.7,500 గౌరవ వేతనం, క్వింటాల్‌కు రూ.150 కమీషన్ ఇచ్చేలా సీఎం చంద్రబాబు అంగీకరించి మేనిఫెస్టోలో పెట్టారన్నారు. త్వరలోనే డీలర్లకు మంచి రోజులు వస్తాయని, ఎండీయూ వ్యవస్థ తప్పక రద్దు అవుతుందన్నారు. అలానే రేషన్ డీలర్ల నగర కమిటీని రద్దు చేసినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా ఉన్నప్పుడు అధ్యక్షుడిగా ఉన్న వైఏబీ ప్రసాదరావు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం అసోసియేషన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతన అధ్యక్షుడిగా లీలామాధవరావు, జనరల్ సెక్రెటరీగా పీటీఎల్ వరప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తుమ్మల గాంధీ ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి డీలర్లను జిల్లా కమిటీలోకి తీసుకొన్నారు.

కన్నా రంగయ్య ట్రస్ట్ సేవలు అభినందనీయం

● దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి
● 'పది'లో ప్రతిభచూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ
● హాజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



విద్యార్థినికి స్కాలర్‌షిప్ నగదు చెక్కు అందజేస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూలై 21 : విద్యార్థుల భవిష్యత్ కోసం కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో కన్నా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షతవహించగా ముఖ్య అతిథిగా మంత్రి రామ నారాయణరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ ఎంతో ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. కన్నా లక్ష్మీనారాయణ, తాను రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతూ స్నేహభావంతో మెలుగుతున్నామన్నారు. తాను సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలలోనే చదివానన్నారు. పిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించాలన్నారు. కార్పొరేట్ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలనే మనస్థత్వాన్ని తల్లిదండ్రులు మానుకోవాలన్నారు. ఈ సేవా కార్యక్రమాలను ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రతిభా వంతులందరికీ కొనసాగించాలని కన్నాను ఆయన కోరారు.

కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2013 నుంచి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఒక పండుగ వాతావరణంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తాతా జయ ప్రకాష్ నారాయణ, చౌట శ్రీనివాసరావు, ఎలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, కట్టా శంకరరావు తవితి భవన్నారాయణ తదితరులు ట్రస్ట్ కార్యక్రమాలను కొనియాడారు. 75 మంది విద్యార్థులకు మంత్రి రామనారాయణరెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ నేతలు స్కాలర్‌షిప్‌ల చెక్కులను అందజేశారు. ముందుగా కన్నా రంగయ్య చిత్రపటానికి వక్తలు, అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో టీడీపీ నేతలు మక్కపాటి రామచంద్రరరావు, గోగినేని కోటేశ్వరరావు, భీమినేని వందనాదేవి, గొర్రెపాటి సుశీల, నూర్ బాషా జానీ బాబు, పూజల వెంకట కోటయ్య, బత్తుల నాగేశ్వరరావు, పెద్దిరాజు, ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, ఆతుకూరి నాగేశ్వరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజక వర్గానికి మొదటి సారిగా వచ్చిన మంత్రి రామనారాయణ రెడ్డిని టీడీపీ నేతలు గజమాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు.



స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో మంత్రి ఆనం, ఎమ్మెల్యే కన్నా తదితరులు

జగన్.. శవ రాజకీయాలు మానుకో..

● పరామర్శ పేరుతో విద్వేషాలు పెంచుతున్న మాజీ సీఎం
● పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్
● జనసేన పార్టీ క్రియశీల సభ్యత్వ నమోదు ప్రారంభం



సర్పంచ్ పవన్‌కుమార్‌ను జనసేనలోకి ఆహ్వానిస్తున్న మనోహర్

తెనాలి రూరల్, జూలై 21: వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్, దళిత యువకుడైన సుబ్రహ్మణ్యంను నిర్దాక్షిణ్యంగా హత్య చేసి, అతడి మృతదేహాన్ని ఇంటిముందే పడవేస్తే.. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు చర్య తీసుకోలేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. శనివారం మండలంలోని నందివెలుగులో జనసేన పార్టీ క్రియశీల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలో మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 64 రోజులు కాకముందే వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి శవ రాజకీయాలకు తెరలేపారని ఆరోపించారు. వినుకొండలో యువకుడి హత్యకు ఇద్దరు స్నేహితుల మధ్య ఏర్పడిన వ్యక్తిగత విభేదాలు కారణం కాగా, బాధిత కుటుంబానికి పరామర్శ పేరుతో వచ్చి టీడీపీయే ఆ హత్య చేసిందంటూ మాట్లాడటం దుర్మార్గమన్నారు. రాజకీయాలకు సంబంధంలేని హత్యను రాజకీయం చేస్తూ ప్రజల్లో భయానకవాతావరణం నెలకొల్పొందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడని దుయ్యబట్టారు. తన బాబాయిని గొడ్డలిపోటుతో చంపితే ఆ ఘటనను గుండెపోటుగా చిత్రీకరించిన జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ నేతలను కాపాడుకుంటూ వచ్చాడని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో జగన్ ఉండగా దళితులపై హత్యలు, ప్రతిపక్షాలపై దాడులు, అక్రమ కేసులు, మహిళలపై అఘాయిత్యాలు, గంజాయి మత్తుకు యువకులను బానిసలు చేసిన ఘటనలు, వైసీపీ అల్లరిమూకలతో చేయని అరాచకాలు లేవని ఒక్కసారి ఆయన పాలనను గుర్తుచేసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

నందివెలుగును అభివృద్ధి పథంలో నడిపిస్తా ..

మండలంలోని నందివెలుగు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని నందివెలుగులో జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్, ఆయన మిత్రబృందం మంత్రి మనోహర్ సమక్షంలో వైసీపీని వీడి జనసేనలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కొత్త సభ్యత్వాలను నమోదు చేసి సభ్యత్వం పొందిన వారికి గుర్తింపుకార్డులు అందించారు. మనోహర్ మాట్లాడుతూ గ్రామంలోని హైస్కూల్ భవన నిర్మాణం, సీసీ రోడ్లు, మురుగు కాలువలు వంటి వాటిని త్వరలోనే పూర్తి చేయించి గ్రామాన్ని నెం1గా తీర్చిదిద్దుతానన్నారు. గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్ వైసీపీని వీడి జనసేనలోకి రావడం శుభపరిణామమన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

మహా మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్

● ఆనందరాజ్ యశ్వంత్ అంబేద్కర్
● పిట్టలవానిపాలెంలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ
● పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన, వివిధ సంఘాల నేతలు



మాట్లాడుతున్న బీఆర్ అంబేద్కర్ మనవడు ఆనందరాజ్ యశ్వంత్

పిట్టలవానిపాలెం, జూలై 21 : ప్రపంచ మహా మేధావిగా, భారత రత్నగా డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ పేరు గడించారని ఆయన మనవడు ఆనందరాజ్ యశ్వంత్ అంబేద్కర్ అన్నారు. మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం ఐలెండ్ సెంటర్‌లో మంతెనవారిపాలెంకు చెందిన అంబేద్కర్ యువ కెరటాలు, పిట్టలవానిపాలెం మండల అంబేద్కర్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆనందరాజ్ యశ్వంత్ అంబేద్కర్ ఆవిష్కరించారు. తొలుత బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్రవర్మ అంబేద్కర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆనంద రాజ్ యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం, శ్రేయస్సు కోసం డాక్టర్ బీఆర్ అబేద్కర్ రాజ్యాంగబద్ధంగా వివిధ హక్కులను కల్పించారన్నారు. ముఖ్యంగా ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో ఆయా ప్రజలకు అనేక ప్రయోజనాలను కల్పించారన్నారు. వాటన్నింటినీ సద్వినియోగం చేసుకొని ఆ సామాజిక వర్గాలు ఉన్నత విలువలతో ముందుకు సాగాలన్నారు. అంబేద్కర్ కొన్నివర్గాల వ్యక్తికాదు ప్రపంచవ్యాప్తంగా అందరికి ఆదర్శ ప్రాయుడని తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ అంబేద్కర్ భావాలను ప్రతి ఒక్కరు అలవర్చుకొని వాటిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలన్నారు. సభకు గుంటూరు అంబేద్కరిస్ట్ డాక్టర్ చుక్కా నాగభూషణం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విశిష్ఠ అతిథి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుపూడి విక్టర్ ప్రసాద్, గౌరవ అతిథులు ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ జోసఫ్ ఇమ్మానియేలు, కేంద్ర మాజీ మంత్రి పనబాకలక్ష్మీ, పిట్టలవానిపాలెం జడ్పీటీసీ గోవతోటి సురేఖ, పిట్టలవానిపాలెం సర్పంచ్ బొలగాని అరుణకుమారి, విశ్రాంత ఐఆర్‌టీఎస్ పనబాక కృష్ణయ్య, విశ్రాంత ఐఆర్ఎస్ ఉప్పులేటి దేవి ప్రసాద్, మాజీ ఐఆర్ఎస్ ఎస్.రవిబాబు, బహుజన కెరటాల వ్యవస్థాపకులు పల్నాటి శ్రీరాములు, పరబాని నాండేడ్, పాలేటి మహేశ్వరరావు, గద్దర్ తనయుడు జీవి.సూర్యకిరణ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి జన్మదిన వేడుకలకు

హాస్టల్ విద్యార్థుల భోజనం..

● అడ్డుకున్న విద్యార్థి సంఘాల నాయకులు
● నాగార్జున విశ్వవిద్యాలయంలో హాస్టల్ విద్యార్థుల ఆందోళన



వర్సిటీ హాస్టల్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పెదకాకాని, జూలై 21: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆదివారం హాస్టల్ విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని విద్యార్థులకు కాకుండా ఓ విశ్రాంత ఉద్యోగి జన్మదిన వేడుకల కార్యక్రమానికి తరలిస్తుండగా విద్యార్థి సంఘ నేతలు అడ్డుకున్నారు. ఇదేంపని అని ఈ విషయంపై నిర్వాహకులను వారు ప్రశ్నించారు. దీంతో హాస్టల్ నిర్వాహకులకు, విద్యార్థులకు మధ్య పెద్ద ఎత్తున వాగ్వివాదం ఏర్పడింది. విద్యార్థులు పెద్ద ఎత్తున కేకలు వేస్తూ, నిర్వాహకుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. హాస్టల్లోనే ఆందోళన బాటపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ హాస్టల్లో విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని, మెస్ చార్జీలను భారీగా పెంచి అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఆరో పించారు. హాస్టల్ విద్యార్థులకు తయారుచేసిన భోజనాన్ని ప్రైవేటు కార్యక్రమానికి ఎందుకు తరలించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. అవినీతి మత్తులో కూరుకుపోయిన వర్సిటీ అధికారుల ప్రమేయంతోనే ఇదంతా జరుగుతుందని, వారు ఏనాడు విద్యార్థు లను పట్టిం చుకున్నది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజన సదుపాయం కల్పించడంలో నిర్వాహకులు పూర్తిగా విఫల మయ్యారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

● మొదటి బహుమతి సాధించిన నిజాంపట్నం క్రీడాకారులు



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త రవికిరణ్

భట్టిప్రోలు, జూలై 21 : ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ఛాంపియన్‌షిప్ 2024 ఎంపిక పోటీలు హోరాహోరీగా జరిగాయి. మండలంలోని పల్లెకోనలోని పరుచూరి రఘుబాబు కళా ప్రాంగణంలో జరిగిన తైక్వాండో పోటీలను ప్రముఖ పారిశ్రామికవేత్త వేములపల్లి రవికిరణ్, ప్రముఖ వైద్యులు వేజళ్ళ పూర్ణానంద్‌లు ప్రారంభించారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో సబ్ జూనియర్, జూనియర్స్, క్యాడెట్, సీనియర్ విభాగాలలో 180 మంది బాలబాలికలు పాల్గొని హోరాహోరీగా పోటీలో పాల్గొన్నారు.

ఏబీసీ తైక్వాండో క్లబ్ రేపల్లె కోచ్ నేషనల్ రిఫరీ ఎ. డేవిడ్‌కుమార్ పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. రాత్రి వరకు జరిగిన పోటీలలో మొదటి బహుమతి సాధించిన నిజాంపట్నం టీమ్‌కు రూ.15 వేలు, ద్వితీయ బహుమతి సాధించిన తెనాలి టీమ్‌కు రూ.10 వేలు, తృతీయ బహుమతి సాధించిన రేపల్లె టీమ్‌కు రూ.5 వేలు నగదు ప్రోత్సాహకాలు, మెమెంటోలను అందజేశారు. రిఫరీలుగా ఏ.దిలీప్, ఏ. చైతన్య, అశ్విల్ అహ్మద్, యూటీఎఫ్ నాయకులు కే.సురేష్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు, స్థానిక ప్రజలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో నాయకులు వేజళ్ళ బసవపున్నయ్య, రాయన ప్రసాద్, వేజళ్ళ సతీష్, జీవీ సాంబశివరావు, రావూరి వరప్రసాద్, మండవ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



విధులకు హాజరైన అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

అసెంబ్లీ సమావేశాలకు పటిష్ఠ బందోబస్తు

● అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా భద్రతా ఏర్పాట్లు
● సమావేశాలు ముగిసే వరకు విధుల్లో అప్రమత్తం
● అధికారులు సిబ్బందికి ఎస్పీ సతీష్ కుమార్ దిశా నిర్దేశం

గుంటూరు, జూలై 21 : రాజధాని అమరావతిలో నేటి నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాజధాని ప్రాంతంలో అసెంబ్లీ సమావేశాల బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాటాడుతూ అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. బందోబస్తు విధులకు హాజరైన అధికారులు, సిబ్బందికి భోజన, వసతి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దారి వెంట బాంబు డిస్పోజల్ టీములు, ఏరియా డామినేషన్ పార్టీలు, డాగ్ స్క్వాడ్ బృందాలు, రోప్ పార్టీలు, టోయింగ్ వెహికల్స్ వారికి కేటాయించిన విధులను ఆయా ప్రదేశాలలో అందుబాటులో వుండాలని సూచించారు. సచివాలయం, అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమైన ప్రాంతాలు, హెలిప్యాడ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ కే.శ్రీనివాసరావు, క్రైం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్‌గౌడ్, ఎఆర్ డీఎస్పీ శాంతకుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్నస్వామి, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆనంద్, ఇతర సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

గుంటూరు(విద్య)జులై 21) జిల్లావ్యాప్తంగా ఈనెల 22 నుంచి పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని గుంటూరు జిల్లా విద్యాశాకాధికారి పీ. శైలజ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం-2020 ప్రవేశపెట్టి 4వ వార్షికోత్సవం పూర్తి అయిన సందర్భంగా కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రధానో పాధ్యాయులు ఆయా పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 22వ తేది స్థానిక వనరు లతో బోధన అభ్యసన సామగ్రి తయారుచేసి ప్రదర్శించటం, 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం, 24న క్రీడా దినోత్సవం- విద్యార్థులకు క్రీడలు, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలియజేసేందుకు క్రీడా పోటీలను నిర్వహించాలని సూచించారు 25న సాంస్కృతిక దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు, పాఠశాలలో పోషణ దినోత్సవ నిర్వహణ, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్దేశించిన విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో పీ. శైలజ, ఎస్ఎస్ఏ ఏపీసీ.విజయ లక్ష్మి సూచించారు.



నిందితుల వివరాల వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐలు, ఎస్ఐ

గంజాయి విక్రేతలు అరెస్టు

● మొత్తం నిందితుల్లో ఒకరు మైనర్, ఆరుగురు యువకులు
● పోలీసుల అదుపులో ముగ్గురు.. పరారీలో నలుగురు
● రెండు కిలోల గంజాయి స్వాధీనం.. డీఎస్పీ రమేష్‌బాబు వెల్లడి

తెనాలి రూరల్, జూలై 21: విశాఖ నుండి గంజాయి తెచ్చి తెనాలి ప్రాంతంలో ప్యాకెట్లుగా చేసి అమ్ముతున్న ముఠాను అరెస్ట్‌చేసినట్లు డీఎస్పీ రమేష్ బాబు తెలిపారు. ఆదివారం పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితులను మీడియా ముందు హాజరుపరిచి వివరాల వెల్లడించారు. బాపట్లకు చెందిన అల్లుమొల్లు మణికుమార్‌రెడ్డి, విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన తాడిశెట్టి జోసెఫ్, కఠెవరం గ్రామానికి చెందిన ఓ మైనర్‌బాలుడు, కఠెవరంకు చెందిన షేక్ ఇమ్రాన్, యర్రబాలెంకు చెందిన భార్గవ్ ప్రశాంత్, మంగళగిరికి చెందిన తిరువీదుల సాయి కృష్ణ, మంగళగిరికి చెందిన కగ్గా తిరుపతయ్యలు ముఠాగా ఏర్పడ్డారు. కఠెవరం గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్ విశాఖ నుండి గంజాయిని తెచ్చి కఠెవరంలో అద్దెకు తీసుకున్న ఇంట్లో ఉంచి వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా కట్టి తెనాలి, మంగళగిరి పరసర ప్రాంతాల్లో మిగిలిన ఆరుగురు నిందితులతో అమ్మకాలు చేయిస్తూ ఉంటాడు. వీరు కళాశాల విద్యార్థులు, యువకులే లక్ష్యంగా ఎంచుకొని విక్రయాలు చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సా చేస్తుంటారు. ఈ ముఠా కదలికలపై నిఘా పెట్టామన్నారు. శనివారం కఠెవరం గ్రామంలో జెండాచెట్టు వద్ద ఇమ్రాన్ అద్దెకు ఉంటున్న గదిని సోదాచేయగా అల్లుమొల్లు మణికుమార్‌రెడ్డి, తాడిశెట్టి జోసెఫ్, కఠెవరం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలుడు ముగ్గురు నిందితులు గంజాయి తాడుతూ రెండు కేజీల గంజాయిని ప్యాక్ చేస్తూ ఉన్నారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మిగిలిన నలుగురు నిందితుల కోసం గాలిస్తున్నామని త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు. ఎంతో చాకచక్యంగా నిందితులను పట్టుకున్న రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రైల్వే స్టేషన్‌లో వ్యక్తిపై కత్తితో దాడి

తెనాలి క్రైం, జులై 21 : తెనాలి రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి 11.45 గంటల సమయంలో 3వ నెంబరు ప్లాట్‌ఫారంపై ఓ వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన జరిగింది. స్థానిక పాండురంగ పేటకు చెందిన పత్తులోతు రాజు రైలులో వైజాగ్ నుంచి తన కుమారిడి కోసం 3వ నెంబరు ప్లాట్‌ఫారంపై వేచి ఉండగా, అదే సమయంలో ఓ యువకుడు అతని వద్దకు వచ్చి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నించాడు. అడ్డుకున్న రాజుపై అగంతకుడు పిడిబాకుతో భుజంపై మూడు సార్లు పొడిచి పారిపోయాడు. ఈ ఘటనపై బాధితుడు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడానికి ప్లాట్‌ఫారంపై చూడగా ఒక్క పోలీసు కనిపించలేదని, చివరికి స్టేషన్ మాస్టర్ గదిలోని ఉద్యోగికి సమాచారం ఇచ్చినట్లు రాజు తెలిపాడు. రాత్రి అయితే తెనాలి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాలు మత్తు గ్యాంగులకు, బిచ్చగాళ్ళకు అవాసంగా మారుతున్నాయని, దీంతో రాత్రి వేళ ప్రయాణించే ప్రయాణికులు భయం భయంతో తాము ఎక్కే రైలు కోసం వేచి ఉండవలసి వస్తుందని ఇప్పటికైనా స్టేషన్‌లో పోలీసు పహారా పెంచి మత్తు గ్యాంగుల ఆగడాలను అరికట్టాలని రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127,138
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

'ఆరా' సేవలు అభినందనీయం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), జూలై 21: సమాజసేవను ప్రోత్సహిస్తున్న ఆరా(అమేయ అమ్యెచూర్ రేడియో అసోసియేషన్) సేవలు అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లో ఆయన కార్యాలయంలో ఆరా క్లబ్, రిపీటర్, వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అమెచ్యర్ రేడియో అభివృద్ధి చేయడం ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. ఆరా సేవలు కూడా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణిత, విద్య సమాజాభివృద్ధికి పనిచేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వానికి అనుగుణంగా ఉన్నాయని ప్రశంసించారు. ముఖ్యంగా విపత్తు సమయంలో రేడియో ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. జ్ఞానాన్ని, ఇతర అంశాలను పంచుకోవడానికి రేడియోను మరింతగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఆరా అధ్యక్షులు ఏవీ సత్యనారాయణ మాట్లాడుతూ 144.90(-600 షిఫ్ట్) రిపీటర్‌తో అంతరాయం లేకుండా సమాచారం అందజేస్తామని తెలిపారు. నూతనంగా ప్రారంభించిన 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఏఏఆర్ఏపీ.కామ్' సైట్ ద్వారా వార్తలు, సమాచారం అందజేయనున్నట్టు వివరించారు. వివరాలకు 8187897388 నెంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైర్‌లెస్ మానిటరింగ్ స్టేషన్ విజయవాడ ఇన్‌చార్జ్ అభిషేక్‌కుమార్, ఆర్.బంగార్రాజు, పద్మజ, నారాయణ, జయచందర్, జి.శ్రీనివాస్, బి.వెంకటరమణ, లక్ష్మీ కాంతం, శరత్‌బాబు, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి నక్కా ఆనందబాబును మర్యాదపూర్వకంగా కలిసిన రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్. సత్యప్రసాద్‌కు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు కనపర్తి, మ్యాని, చిట్టిబాబు

ప్రతి పేదవాడికీ ఆహార భద్రత ఉండాలి : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆహార భద్రత ప్రతి పేదవాడికి వర్తింపచేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. వైన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో జరిగిన జిల్లా జాతీయ ఉత్పత్తి, పంపిణీ పథకం నిర్వహణదారుల సంక్షేమ సంఘం సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆహార భద్రత ప్రతి పేదవాడికి వర్తింపచేయాలని అన్న ఎన్టీఆర్ రూ. 2కే కిలో బియ్యం ఇచ్చి పేదవాడి పొట్ట నింపే కార్యక్రమం చేపట్టగా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహార భద్రత వ్యవస్థను పూర్తిగా కట్టుదిట్టం చేశారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు వంటి తొమ్మిది రకాల వస్తువులను చౌక డిపోల ద్వారా అందజేయగా, జగన్‌రెడ్డి పాలనలో బియ్యం తప్ప ఏ ఇతర ఆహార పదార్థాలు ప్రజలకు అందడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దివి లీలా మాధవరావు, తుమ్మల గాంధీ, పెద్ది వరప్రసాద్, అడపాల వెంకటరమణ, గంగాధర్ గౌడ్, ఏడుకొండలు జిల్లాలోని చౌక డిపో నిర్వాహకులు పాల్గొన్నారు.



బ్రెయిన్ వాక్‌లో పాల్గొన్న న్యాయమూర్తి రామకృష్ణ, విజయ తదితరులు

బ్రెయిన్ హెల్త్ వాక్

గుంటూరు (మెడికల్) జూలై 21: ఇన్నర్ రింగ్‌రోడ్‌లోని శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఏపీఎన్ఎస్ఏ) 31వ వార్షిక సదస్సు ఏపీ న్యూరోకాన్ ఆదివారంతో ముగిసింది. తొలుత అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక చంద్రమౌళీ నగర్‌లోని వెల్‌కం హోటల్ నుంచి గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ వరకు అందరికీ మెదడు ఆరోగ్యం (బ్రెయిన్ హెల్త్ ఫర్ ఆల్) అనే నినాదంతో నడక కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ.రామకృష్ణ జెండా ఊపి వాక్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని, ప్రశాంతమైన నిద్ర అవసరమని వివరించారు. ధూమపానం మానేయాలని, ఒత్తిళ్ళు తగ్గించుకోవాలని రామకృష్ణ సూచించారు. అనంతరం జరిగిన వాక్‌లో మెదడు ఆరోగ్యంపై ప్రజలను చైతన్యపర్చేలా పలు ప్లకార్డులు, ఫ్లెక్సీలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్ఎస్ఏ అధ్యక్షురాలు డాక్టర్ పీ విజయ, కార్యదర్శి కే.బాబ్జీ, ఏవీ రమణమూర్తి, ఎన్‌వీ సుందరాచారి, ఎస్.శ్రీనివాసరావు, తారక్‌నాథ్, బాబ్జీ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా రెవెన్యూ తెలంగాణకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి

● మంత్రి అనగాని సత్యప్రసాదుకు దిలీప్‌రాజా వినతి



అనగాని సత్యప్రసాదుకు విజ్ఞాపన చేస్తున్న దిలీప్‌రాజా

గుంటూరు(తూర్పు), జూలై 21: సినిమా రెవెన్యూ తెలంగాణకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరులో కన్నా లక్ష్మీనారాయణ నివాసంలో ఆదివారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాదుకు సినీ దర్శకుడు దిలీప్‌రాజా వినతిపత్రం అందజేశారు. అనంతరం దిలీప్ రాజా మాట్లాడుతూ దీనిపై రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి సమస్యపై చర్చించామని తెలిపారు. ఆంధ్రాలో షూటింగ్‌లు చేసుకుంటూ రెవెన్యూ తెలంగాణాకు వెళ్లకుండా యుద్ధప్రతిపాదికపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డ ఇద్దరిపై కేసు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 21: ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసానికి పాల్పడ్డ ఇద్దరిపై పాతగుంటూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పొన్నూరు రోడ్‌లోని పంచవటి అపార్టుమెంట్లోని ఓ ప్లాట్లు బెటర్మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరు మీద షేక్ అఫ్రిన్, షేక్ ఆరిఫ్‌లు ఒక సంస్థను పెట్టారు. ఆన్‌లైన్లో ఉద్యోగాలు ఇప్పిస్తాం రమ్మని ఆదివారం ఇంటర్వ్యూకి పిలిచారు. ఇంటర్వ్యూలో సంబంధం లేని ప్రశ్నలు అడుగుతున్నారు. దీనిని ప్రశ్నించడంతో అఫ్రిన్, ఆరిఫ్‌లు ఇంటర్వ్యూకి వచ్చిన వారితో అసభ్యకరంగా మాట్లాడారు. దీంతో మహమ్మద్ షబ్బీర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు

గుంటూరు, జూలై 21: స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 6/20కి చెందిన ఒక యువతిని ప్రేమ పేరుతో మోసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె నగరంలోని ఓ ప్రైవేట్ టెలికం కంపెనీలో పని చేస్తుంది. అదే కంపెనీలో అంకిరెడ్డిపాలేనికి చెందిన ఓర్సు శివకృష్ణ కూడా పనిచేస్తున్నాడు. ఏడాదిన్నరగా వారిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఎలాగూ పెళ్లి చేసుకుంటాం కదా అనే ఆలోచనతో వారిద్దరూ కలిసి మెలిసి తిరిగారు. తీరా పెళ్లి చేసుకోమంటే శివకృష్ణ నిరాకరించడంతో బాధితురాలు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శివకృష్ణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండితులకు సత్కారం

గుంటూరు(తూర్పు), జూలై 21: గురుపౌర్ణమి సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ సన్నిధిలో ఆలయ పాలకమండలి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వారి ఆధ్వర్యంలో ఉదయం ఐదుగురు పండితులకు సత్కారం నిర్వహించారు. సాయంత్రం తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి, భాగవత గోష్ఠి బృందంచే విష్ణు, లలిత సహస్రనామ, కనకధార స్తోత్ర పారా యణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లే పల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జూన్ 21 : స్థానిక కొత్తపేట, గణేష్‌రావుపేటలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ, కృష్ణకుమారి పలు బాబా గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణ, తబలాపై షణ్ముఖ శర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు నరసింహారావు సత్కరించారు.

గుంటూరు సమస్యల పరిష్కారమే లక్ష్యం

● భూగర్భ మురుగునీటి వ్యవస్థ(యూజీడీ) ఏర్పాటుపై కసరత్తు
● అమృత్, హడ్కో ద్వారా నిధుల సేకరణకు ప్రణాళికలు
● టౌన్ ప్లానింగ్ విధివిధానాలపై ఆరోపణలు
● మున్సిపల్ అధికారులతో పెమ్మసాని ప్రత్యేక సమావేశం

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): 'ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాల్సిందే. భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ), డివైడర్లు, పార్కులు, ట్రాఫిక్ కూడళ్లలో బ్యూటిఫికేషన్ వంటి ఏర్పాట్లు త్వరగా జరగాలి' అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. కొద్ది రోజుల క్రితం నగరాభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలపై కార్పొరేషన్ అధికారులతో ఆయన తన కార్యాలయంలో ఆదివారం పునఃసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో యూజీడీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తక్షణమే యూజీడీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, బ్యూటిఫికేషన్ అంశాలపైనా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి నిధుల సేకరణకు తన వంతు కృషి చేస్తానన్నారు. నగరంలోని ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న రహదారులకు ప్యాచ్ వర్క్ చేయాల్సిన బాధ్యతను నగరపాలక సంస్థ తీసుకోవాలని, ఆ దిశగా ఇంజనీరింగ్ అధికారులు పనిచేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్‌పై ఎన్నో ఆరోపణలు ఉన్నాయని, తక్షణమే విధివిధానాలపై మార్పులు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో సిటీ టౌన్ ప్లానర్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

గుంటూరు(తూర్పు), జూలై 21: గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాలను నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో సాయిబాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయినాధునికి పంచామృతాలతో అభిషేకం, అలంకారపూజ, అర్చన తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో భక్తులచే గురుచరిత్ర పారాయణం, సాయినాధుని సంకీర్తన చేశారు. స్థానిక విద్యానగర్లో 3వ లైన్లోని సాయినాధుని సన్నిదానంలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు, కార్పోరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాదు, నూకల బాలాజీ, కొమ్మినేని కోటేశ్వరరావు వేడుకలకు హాజరై సాయిబాబాను దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ దంపతులు

ఆర్ అగ్రహారం సాయిమందిరంలో..

గుంటూరు, జూలై 21: ఆర్ అగ్రహారం సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. నిర్వాహకులు తిరుమలశెట్టి శివరామకృష్ణ, తూనుగుంట్ల నాగేశ్వరరావు, కోట దుర్గాప్రసాద్‌లు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గౌతమినగర్ షిరిడి సాయి మందిరంలో

గుంటూరు(కార్పొరేషన్), జూలై 21: గుంటూరు నగరంలోని గౌతమినగర్‌లో గల షిరిడి సాయి మందిరం మహిమలు కలిగిన దేవాలయంగా భక్తులచే పిలవబడుతుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో కలసి ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, కార్మికశాఖ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన పలు పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాధవి పాల్గొన్నారు.

విఘ్నేశ్వర దత్త సాయిబాబా మందిరంలో...



గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): గురువులతో అత్యంత గౌరవంగా మెలగాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని విఘ్నేశ్వర దత్త సాయిబాబా మందిరంలో ఆరో డివిజన్ పోతురాజు సమత, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, పోతురాజు రామకృష్ణ పాల్గొన్నారు.

● గుంటూరు, జూలై 21: పొన్నూరు రోడ్డు సంగడిగుంట శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీదుర్గా లలితా పారాయణ బృందం సభ్యులు అమ్మవారికి ఆషాడం సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోరబోయిన నరసింహారావు, తదితరులున్నారు.

● అరండల్‌పేటలోని శ్రీ మోహనరంగ నాయకస్వామి దేవాలయంలో



అరండల్‌పేట ఏడో లైన్‌లో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

ఆది గురువు జాంబవ మాదిగ దేవుడు వద్ద జరిగిన గురుపౌర్ణమి వేడుకలకు మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి పలువురు నాయకులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

● పొన్నూరు రోడ్డులోని ఐపీడీ కాలనీ రోడ్డులో ఉన్న షిర్డీసాయి మందిర్‌లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రావూరు లక్ష్మీనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు.

● గురుపౌర్ణమి పురస్కరించుకొని బ్రాడీపేటలోని ఓంకార క్షేత్రంలో భక్తి సంగీత కచేరి నిర్వహించారు. గాయకులు ఆర్‌పీఎల్ నరసింహారావు, వల్లూరి కృష్ణకిషోర్, పీఎస్ఎన్ మూర్తిలు పలు భక్తి కీర్తనలు పాడారు.

గురువులే సమాజ మార్గ నిర్దేశకులు కావాలి

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆషాడ శుద్ధ పూర్ణిమ(గురు పూర్ణిమ) సందర్భంగా బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమర్ సారధ్యంలో గురువులను సత్కరించారు. ఆదివారం పట్టాభిపురం మున్సిపల్ హైస్కూల్ పూర్వ హెచ్ఎం గడియారం రామకృష్ణ-రమణి దంపతులు, జేకేసీ కళాశాల తెలుగు డిపార్టుమెంటు పూర్వ సారధి పులిచర్ల సాంబశివరావు- భారతి, పీఈటీ రాంబాబు, విద్యావేత్త, న్యాయవాది జూపూడి రంగరాజు, హైమావతిలను సత్కరించారు.

సరస్వతి శిశుమందిర్‌లో..

సరస్వతి శిశు మందిర్ సంపత్‌నగర్ పాఠశాలలో గురు పౌర్ణమి కార్యక్రమం బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పత్రి బిందుమాధవ్, లెక్చరర్ వెంకటేశ్వరరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, సరస్వతీ విద్యాపీఠం విజయవాడ సమితి కోశాధికారి వనమానరేంద్ర, గుంటూరు విభాగ్ అధ్యక్షుడు వనమా పూర్ణచంద్రరావు తదితరలు పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు), జూలై 21: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో గురుపౌర్ణమి సందర్భం గా చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి. జయేంద్ర సరస్వతి స్వామి. విజయేంద్రసరస్వతి స్వామి చిత్రపటాలతో ఆలయ ప్రదక్షిణతో గురుపూజ, విశేష పూజలు నిర్వహించారు. ధార్మిక ప్రాంగణంలో గురుపౌర్ణమి సందర్భంగా గణపతి చండీ రుద్ర హోమాలు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో విశ్వ కల్యాణాన్ని కాంక్షిస్తూ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సూర్యదేవర వెంకటేశ్వర్లు, కూర్మనాధన్. కొర్రపాటి నాగేశ్వరరావు, గోపీచంద్, పుట్ట ప్రభాకరరావు, లంక విజయబాబు, ఆలయ ప్రధానార్చ కులు మాధవస్వామి బృందం పాల్గొన్నారు.



జూట్ మిల్ దగ్గరలోని ద్వారకామాయి మందిరంలో స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

ఔషధ దుకాణాల మనుగడ ప్రశ్నార్థకం

● రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రంగారావు

గుంటూరు(తూర్పు), జూలై 21: విపరీతమైన మెడికల్ పోటీ ప్రపంచంలో ఔషధ దుకాణాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కేపీ రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం, స్థానిక లక్ష్మీపురం కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో సంఘ జిల్లా తొలి జనరల్ బాడీ సభ్యుల పదవి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అప్పులు, వడ్డీలు చెల్లించలేక వ్యాపారులు దుకాణాలు మూసివేసి ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడటం బాధాకరమని అన్నారు. అసోసియేషన్ పిలుపు మేరకు హోల్‌సేల్, రిటైల్ మెడికల్ షాపుల వద్ద డిస్కౌంట్ బోర్డులు తొలగించాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు జీఎన్ఎస్ ఆదినారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యాపారులు తప్పనిసరిగా సభ్యత్వం, రెన్యువల్స్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు కె.చంద్రశేఖరరావు, ఎస్.సుబ్బారావు, టీవీ సుబ్రహ్మణ్యం, బీవీ ప్రసాదరావు, కే శివ శంకరరావు, టీవీ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ రాజకీయవేత పవన్‌కల్యాణ్

గుంటూరు, జూలై 21: సమాజంపై బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రజాసేవ కోసం తన జీవితం అంకితం చేసిన జనసేనాని పవన్ కల్యాణ్ ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం పొందారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి కొనియాడారు. ఆదివారం 44వ డివిజన్ జనసేన అధ్యక్షుడు పవన్ వెంకీ ఆధ్వర్యంలో కొరిటెపాడు సెంటర్‌లో జరిగిన జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ రాజకీయాల్లో పవన్ కల్యాణ్ లాంటి నిస్వార్థ నేతలు చాల అరుదుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన 52, 35 డివిజన్‌ల అధ్యక్షులు కృష్ణ, జెట్టి బాబు, నాయకులు అడపా మాణిక్యాలరావు, మధులాల్, నారదాసు ప్రసాద్, పూర్ణ, కర్నాటి వాసు, ఆదినారాయణ, మురళీ, సర్దార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూలై 21: స్థానిక గోరంట్ల నెక్స్‌జెన్ ఇంటర్నేషల్ పాఠశాల ఇండోర్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ జట్ల ఎంపికలు ముగిశాయి. ఎంపికైన క్రీడాకారులు కర్నూలు జిల్లాలో ఆగస్టులో 10, 11 తేదీలతో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ కార్యదర్శి తిరుపతిరావు తెలిపారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అయ్యన్ ఫౌండేషన్ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది ఇంద్ర శేఖర్‌రెడ్డి, పాఠశాల పీఈడీ హెచ్‌వోడీ కిషోర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు సభ్యులు ఇమ్మానీయేలురాజ్, పీఈటీలు వాసంతి, లక్ష్మీ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలి

● డిస్ట్రిక్ట్ 316 హెచ్ గవర్నర్ పరుచూరి గోపీచంద్

గుంటూరు(తూర్పు), జూలై 21: లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 316 హెచ్ గవర్నర్ పరుచూరి గోపీచంద్ అన్నారు. ఆదివారం స్థానిక జేకేసీ కళాశాల సమావేశం మందిరంలో జిల్లా లయన్స్ క్లబ్స్ తొలి కార్యవర్గ సమావే శంతో పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్, జిల్లా చీఫ్ అడ్వైజర్ నూతలపాటి వీర ప్రకాష్‌రావు మాట్లాడుతూ 2024-25లో యువతకు స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ, పర్యావరణ పరిరక్షణ, క్యాన్సర్ వ్యాధిపై విస్తృత అవగా హన, నిరోధక సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్య క్రమంలో జిల్లా క్యాబినెట్ సెక్రటరీ వీవీ సుబ్బయ్య, కోశాధికారి డాక్టర్ సీహెచ్ చక్రపాణి, తక్షణ మాజీ గవర్నర్ కృపానందం, ఎంసీసీ శ్రీని వాసరావు పాల్గొన్నారు.

జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలిగా డాక్టర్ భవానిదేవి



డాక్టర్ భవానిదేవి

గుంటూరు, జూలై 21 : జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలుగా డాక్టర్ సి.భవానీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అరండల్‌పేట 5/3లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని సమావేశ మందిరంలో గుంటూ రు జిల్లా రచయితల సంఘం అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులుగా తెలుగు సాహిత్య రంగం లో విశేష కృషి చేసిన విదుషీమణి, ప్రముఖ రచయిత్రి డా.సి.భవాని దేవిని ఎన్నుకున్నారు. సోమేపల్లి వెంకట సుబ్బయ్య మరణానంతరం ఖాళీ గా ఉన్న అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నిక ప్రక్రియలో మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు డాక్టర్ సి.భవానిదేవిని ఎన్నుకున్నట్లు సంఘ ఉపాధ్యక్షులు బి.ఉమామహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని తెలిపారు.

ఏం ఘనకార్యం చేశాడని జగన్ ఢిల్లీ పర్యటన

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్

గుంటూరు, జూలై 21: ఏం ఘనకార్యం చేశాడని జగన్ ఢిల్లీ పర్య టనకు వెళుతున్నాడని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. హింస, విధ్వంసం, అరాచకం, అన్యాయం, అవినీతి గురించి జగన్‌రెడ్డి మాట్లాడటం రోత పుట్టిస్తుందన్నారు. బాధితులనే నిందితులను చేసి ప్రభుత్వం టెర్రరిజానికి పాల్పడిన ఆ చీకటి రోజులు రాష్ట్రంలో పోయి నెల దాటిందన్నారు. కూటమి ప్రభుత్వం మిగిలిన అరాచకపు ఆనవాళ్లను కూడా కూకటి వేళ్లతో పెకిలించి వేస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రజల రక్షణకు కట్టుబడి ఉందని, ఎటువంటి ఘటనలను కూడా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజాపాలన, అవినీతి రహిత పాలనే లక్ష్యంగా చంద్రబాబు అడుగులు వేస్తున్నారన్నారు.

సమస్యల పరిష్కారంపై పశ్చిమ ఎమ్మెల్యే దృష్టి

● క్షేత్రస్థాయి పర్యటనలతో సమస్యల వెలికితీత
● గడిచిన రెండు రోజుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారంపై పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి దృష్టి సారించారు. ఎమ్మెల్యే అయిననాటి నుంచి స్థానిక ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతుండటంతో ఆమె వాటి పరిష్కారం దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. కొన్ని రోజులుగా ద్విచక్ర వాహనంపై నగరంలోని పలు డివిజన్లలో పర్యటించిన ఆమె, డివిజన్ల వారీగా క్షేత్ర స్థాయి సమస్యలను నమోదు చేసుకున్నారు. పర్యటనల సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులపై దృష్టిపెట్టారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు ప్రధాన సమస్యలుగా గుర్తించిన ఆమె వాటి పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నారు. రెండురోజుల క్రితం నగరంలోని అరండల్‌పేట, బ్రాడీపేటల్లో పలు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఆమె, వర్షాల నేపథ్యంలో పారిశుధ్యంపై దృష్టి సారించారు. 2రోజుల క్రితం 23వ డివిజన్లో పర్యటించి పారిశుధ్యంపై సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఆ డివిజన్లో ఆదివారం పారిశుధ్యపనులు చేపట్టారు. దరియానగర్‌లోని పోలీస్ క్వార్టర్స్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించారు.

దేవదాయశాఖ మంత్రి ఆనంతో ఎమ్మెల్యే మాధవి భేటీ



దేవదాయ శాఖ మంత్రికి మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, రామచంద్రరావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు మొక్కను బహూకరించారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను పరామర్శించటానికి ఆదివారం ఆయన గుంటూరు వచ్చారు. ఈ సందర్భంగా గల్లా మాధవి ఆనంతో భేటీ అయ్యారు. నియోజకవర్గ పరిధిలోని దేవదాయ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై మంత్రితో చర్చించారు. విద్యానగర్ పరిధిలోని ఒక ఎకరం స్థలంలో కల్యాణ మండపం ఏర్పా టు చేయాలని మంత్రిని కోరారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రం పక్కన స్థలంలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న 50 కుటుంబాల వారిని ఖాళీ చేయించకుండా, మానవీయ కోణంలో సహాయం చేయాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలి

● రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గుంటూరు (విద్య), జూలై 21: రాష్ట్రంలో పెన్షనర్ల సమస్యలు కొత్త ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం పూర్తి స్థాయిలో కుదురుకున్న వెంటనే సీఎం చంద్రబాబుకు ఆయా సమస్యలు విన్నవించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం తాలుకా ఆవరణలోని పెన్షనర్స్ హోమ్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా 11వ పీఆర్‌సీలో తగ్గించిన అదనపు క్వాంటం తిరిగి పునరుద్ధరించడం, పీఆర్‌సీ, డీఆర్ బకాయిలు సాధించేలా జేఏసీతో కలిసి పని చేస్తామన్నారు. కోశాధికారి టీవీఎస్ ఆర్‌ఏ శర్మ, సహాధ్యక్షుడు జీఎస్ అబ్దుల్ కరీం, రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభుదాసు పదవీ విరమణ పొందిన వారిని సభ్యులుగా చేర్చుకో వాలని సూచించారు. తొలుత నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణకు సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు.

అవోపా ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ

గుంటూరు(విద్య), జూలై 21: స్థానిక అరండల్‌పేటలోని అవోప (ఆర్యవైశ్య ఆఫీషియల్స్ ప్రొఫెసనల్స్ అసోసియేషన్) కార్యాలయంలో ఆదివారం వృద్ధులకు పెన్షన్లు పంపిణీ చేశారు. అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ పంపిణీ చేసినట్లు సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మద్దు రామకృష్ణయ్య, డాక్టర్ వైదేహి, అవోప రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు చింతా కృష్ణారావు, నగర కార్యదర్శి రాధకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, మట్టుపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వసతి గృహ భవనం నిర్మాణాన్ని పూర్తి చేయాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ

గుంటూరు (తూర్పు), జూలై 21: స్థానిక బీఆర్ స్టేడియం సమీ పంలో ఉన్న కోడి గుడ్డు సత్రం నందు నిర్మిస్తున్న సమీకృత సంక్షేమ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. ఆదివారం, కోడి గుడ్డు సత్రం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011లో ప్రారంభమైన ఈ వసతి గృహ పనులు ఇంకా పూర్తి కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా లక్షల రూపాయలు అద్దెలుకడుతుందని అదేప్రభుత్వ ధనాన్ని ఈ భవనానికి కేటాయించినట్లైతే ఈ భవనం పూర్తయ్యేదని అన్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం 75% పనులు పూర్తి చేసిందని గుర్తు చేశారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు నిలిపివేయడంతో పనులు ఆగిపోయాయని మండిపడ్డారు. కార్యక్రమం లో నగర కార్యదర్శి యశ్వంత్, డేవిడ్, కిరణ్, గణేష్, బన్నీ, అజయ్ పాల్గొన్నారు.

చల్లావారిపాలెంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

గుంటూరు, జూలై 21: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు రూరల్ మండలం చల్లావారిపాలెంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. జాతీయ జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన రెండో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, ఉప సర్పంచ్ తిమ్మిశెట్టి శంకర్, జనసేన గ్రామ అధ్యక్షుడు సూదా పిచ్చయ్య, నాయకులు శంకర్, కే శ్రీనివాసరావు, ఎస్ వెంకటరావు, సూరిశెట్టి హరీష్ తదితరులున్నారు.

క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలి

● 'ఐలు' రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), జూలై 21: విస్తృతమైన చర్చలు, సంప్రదింపులు చేయకుండా అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం, బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్ అధ్యక్షతన 'క్రిమినల్ చట్టాలు-ప్రజలకు శాపాలు' అనే అంశంపై స్టడీ సర్కిల్ జరిగింది. ఈ సందర్భంగా నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన చట్టాల నిబంధనలు పోలీసులకు నిరంకుశ అధికారాలను కల్పిస్తున్నాయని వివరించారు. ఈ చట్టాల అమలును నిలిపివేయాలని సుమారు 3600 మంది వివిధ రంగాల ప్రముఖుల విజ్ఞప్తిని పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఇంజనీర్ జి.వెంకట్రావు, ప్రొఫెసర్ ఎన్ వేణుగోపాలరావు, అవధానుల హరి, వై నేతాజీ, కే పద్మ, షకీలా బేగం పాల్గొన్నారు.

క్యాంటీన్‌ను మాజీ సైనికులు సద్వినియోగం చేసుకోవాలి

● కమిటీ చైర్మన్ కల్నల్ చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), జూలై 21: ఉమ్మడి గుంటూరు జిల్లాల మాజీ సైనికుల కోసం క్యాంటీన్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చినట్టు క్యాంటీన్ కమిటీ చైర్మన్ కల్నల్ ఎస్ ఎం చంద్రశేఖర్, ఎన్‌సీసీ కల్నల్ సాజల్ కాంత్‌దాస్ తెలిపారు. స్థానిక శ్యామలానగర్, ఎన్‌సీసీ, సీఎస్‌డీ క్యాంటీన్ ఆవరణంలో నూతనంగా నిర్మించిన కౌంటర్లను మాజీ సైనికులు విష్ణుబొట్ల రాజారామ్‌తో కలిసి వారు ఆదివారం ప్రారంభించారు. అనంతరం కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ మాట్లా డుతూ క్యాంటీన్ ఆవరణలో ఏర్పాటు చేసిన నిర్మాణాలు, వైజాగ్ క్యాంటీన్ స్టోర్స్‌తో చేస్తున్న లావాదేవీలు, మాజీ సైనికుల కోసం వివిధ పేర్లతో ఏర్పాటు చేసిన గ్రోసరీ సదుపాయాలను సులభతరంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు ఆళ్ల రాఘవరావును ఆయన సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ సైనికుల లీగ్ (ఐఈఎస్ఎల్) ముఖ్య కార్యదర్శి రెడ్డి శ్రీనివాస వరప్రసాద్, రాష్ట్ర సమీకృత త్రిదళ మాజీసైనికుల కమిటీ ముఖ్య కార్యదర్శి కాలేషా, క్యాంటీన్ మేనేజర్ విశ్రాంత కల్నల్ ఉప్పల వెంకటే శ్వర్లు, సుధాకర్, ఫణీ పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐపీహెచ్ఎంలో డిప్లొమా, పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(పీజీడీపీహెచ్ఎం)', 'డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(డీపీహెచ్ఎం)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే రిటెన్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లలో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ల్యాబొరేటరీ తరగతులు, ఫీల్డ్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, స్టయిపెండ్‌తో కూడిన ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. నిబంధనల ప్రకారం మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ఇండస్ట్రీ స్టాండర్డ్ ప్యాకేజీతో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

పీజీడీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ బయోసెక్యూరిటీ, పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ హెల్త్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్ మొత్తానికి 40 క్రెడిట్లు నిర్దేశించారు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్లాంట్ హెల్త్ ఎక్స్‌పర్ట్‌లుగా, పెస్టిసైడ్ క్వాలిటీ అనలిస్ట్‌లుగా రాణించవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)/ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(కెమిస్ట్రీ) అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికోసం అయిదు సీట్లు ప్రత్యేకించారు.

ప్రోగ్రామ్ ఫీజు: నిరుద్యోగులకు రూ.80,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.2,00,000

డీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. దీనికి 20 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/లైఫ్ సైన్సెస్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.40,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** జూలై 30
- **రిటెన్ ఎగ్జామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 5
- **రిటెన్ ఎగ్జామినేషన్ తేదీ:** ఆగస్టు 12
- **సెలెక్టయిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 19
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 25 నుంచి
- **వెబ్‌సైట్:** https://niphm.gov.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 2

భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023



బీఎన్ఎస్ఎస్‌లో 531 సెక్షన్లు ఉన్నాయి. పాతచట్టమైన సీఆర్‌పీసీలో 484 సెక్షన్లు ఉండేవి. దీని నుంచి 14 సెక్షన్లను ప్రస్తుతం పూర్తిగా తొలగించి, కొత్త చట్టాన్ని మరికొన్ని సవరణలతో తీసుకువచ్చారు.

కీలకాంశాలు

- బీఎన్ఎస్ఎస్ న్యాయ విచారణలోని వివిధ అంశాలు, దశలకు సంబంధించి కచ్చితమైన కాల అవధులను నిర్ణయించింది. ఉదాహరణకు వాద ప్రతివాదనలు పూర్తయ్యాక 30 రోజుల్లోగా కొన్ని సందర్భాల్లో 60 రోజుల్లోగా కోర్టులు తీర్పులు వెలువరించాలి. అత్యాచార కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్ చేసిన వైద్యులు ఏడు రోజుల్లోగా నివేదికను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌కు అందించాల్సి ఉంటుంది. బాధితులకు కేసు దర్యాప్తు పురోగతిని కేసు నమోదు చేసిన తరవాత 90 రోజుల్లోగా అందించాలి. ఇలాంటి అంశాలు గడువులతో సహా నిర్దేశించారు.
- ఏడు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో తప్పనిసరిగా ఫొరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరగాలి.
- వారెంటుతో అయినా, వారెంట్ లేకున్నా జరిపే సోదాలను ఆడియో - వీడియో సహితంగా చిత్రీకరించి మెజిస్ట్రేట్‌కు సమర్పించాలి.
- ఫిర్యాదు మొదలు తీర్పు వరకూ అన్ని దశల్లోనూ సాంకేతిక, మాధ్యమ వినియోగం తప్పనిసరి చేశారు. ఉదాహరణకు ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదు చేయడం, సమన్లు సంబంధిత వ్యక్తులకు వాట్సాప్ ద్వారా కూడా అందించడం, దర్యాప్తు, విచారణ ఆసాంతం దృశ్య-శ్రవణ మాధ్యమాల్లో చిత్రీకరించాల్సి ఉండటం.
- ముద్దాయిని అరెస్ట్ చేయడం అన్ని కేసుల్లో తప్పనిసరి కాదు. ప్రత్యామ్నాయంగా పోలీసులు ముద్దాయి నుంచి మెజిస్ట్రేట్ ముందు హాజరవుతానన్న వాగ్దానంతో కూడిన సెక్యూరిటీ బాండ్‌ను తీసుకోవడం ద్వారా అరెస్ట్ చేయకుండా ఉండవచ్చు.
- బాధితులు నేరం జరిగిన ప్రదేశానికి చెందిన పోలీస్‌స్టేషన్‌లోనే కాక తమకు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి అవకాశం కల్పించే జీరో ఎఫ్ఐఆర్‌ను సంబంధిత ప్రాధికార పోలీస్‌స్టేషన్‌కు 15 రోజుల్లోగా ఫిర్యాదు అందుకున్న పోలీస్‌స్టేషన్ బదిలీ చేయాల్సి ఉంటుంది.
- కొన్ని కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్‌కు సంబంధించి ఏ స్థాయి పోలీసు అధికారి అయినా విన్నవించవచ్చు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి కన్నా దిగువస్థాయి కలిగి ఉండవచ్చు.
- కోర్టులు, వాటి ప్రాధికార పరిధిని క్రమానుగత శ్రేణిలో స్పష్టంగా కిందిస్థాయి కోర్టులు మొదలు సుప్రీంకోర్టు వరకూ పేర్కొన్నారు.
- ఏదైనా నేరానికి సంబంధించి పడే శిక్షాకాలంలో సగానికి పైగా విచారణ ఖైదీగా పూర్తిచేసిన పక్షంలో పూచీకత్తు బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం గతంలో వలే ఉంది. అయితే, అనేక నేరాల్లో ముద్దాయి అయితే, జీవితఖైదు లేదా మరణదండన విధించే నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు బీఎన్ఎస్ఎస్ ప్రకారం అది వర్తించదు.
- ముద్దాయి అరెస్ట్ కానప్పటికీ అతని చేవ్రాలు, వేలి ముద్రలు, రాత, గొంతు రికార్డింగ్ వంటి ఆధారాల సమర్పణకు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశించవచ్చు.
- ఎవరైనా ముద్దాయి విచారణ నుంచి తప్పించుకోవడానికి పరారీలో ఉన్నప్పుడు, అతన్ని అరెస్ట్ చేసే అవకాశాలు ఇంతలో కనిపించనప్పుడు అతను లేకున్నా న్యాయవిచారణ జరిపి, తీర్పు వెలువరించవచ్చు.
- ఏడు లేదా అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు శిక్ష పడే అవకాశమున్న నేరాలకు సంబంధించి ఏదైనా కేసును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటే బాధితులకు తమ అభిప్రాయాన్ని కోర్టుకు విన్నవించుకునే అవకాశం ఇవ్వాలి.


ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

బీఎన్ఎస్ఎస్‌పై విమర్శలు

- విచారణ ఖైదీగా శిక్షాకాలంలో సగానికి పైగా కాలం జైలులో గడిపినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు, జీవితఖైదు, మరణదండన వంటి శిక్షలు విధించబడే నేరాలు చేసినప్పుడు గతంలో వలే బెయిల్ లభించకుండా బీఎన్ఎస్ఎస్ చట్టం నిర్దేశిస్తుంది. అయితే అనేక సెక్షన్లు వర్తించే ఒకే నేరం సాధారణ శిక్షలు పడే నేరం అయినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా పరిగణింపబడి బెయిల్ నిరాకరణకు గురయ్యే అవకాశాలున్నాయి. దీనివల్ల సాధారణ నేరాలకు, తీవ్ర నేరాలకు తేడా లేకుండా పోతుంది. జైళ్లు నిండిపోతాయి.
- అనేక కేసుల్లో చేతి సంకెళ్లు వేయడానికి బీఎన్ఎస్ఎస్ చట్టం పోలీసులను అనుమతిస్తోంది. అయితే ఈవిధంగా సంకెళ్లు వేయడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు, మానవహక్కులకు విరుద్ధం. కాబట్టి ఈ అంశం వివాదాస్పదంగా ఉంది.
- ఈ కొత్త చట్టం ప్రకారం పోలీసు కస్టడీ కోరే దర్యాప్తు అధికారి కారణాలు చూపాల్సిన అవసరం లేదు. పోలీసు కస్టడీ సమయం కూడా గతంలో ఉన్న 15 రోజుల నుంచి బీఎన్ఎస్ఎస్ చట్టం ద్వారా 90 రోజులకు పొడిగించారు. ఈ అంశాల వల్ల పోలీసు అధికారాలు పెరగడం, మానవ హక్కులపై ప్రభావం పడటం వంటి వలసకాలం నాటి(బ్రిటీష్) అణచివేత పరిస్థితులు మరలా తలెత్తుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది.
- పరారీలో ఉన్న వ్యక్తులపై న్యాయవిచారణను జరిపి, వారికి శిక్షలు సైతం నిర్ధారించగల అవకాశం ఈ కొత్తచట్టంలో ఉంది. ఇది నిందితులను పట్టుకుని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలన్న ఒత్తిడిని ప్రభుత్వ యంత్రాంగాలపై తగ్గిస్తుంది. అంతేకాక నిందితుల వాంగ్మూలం, అసలు నిజాల వెలికితీత మరుగునపడిపోయే ప్రమాదం కూడా ఉంది.
- ప్రజా జీవనం(పబ్లిక్ ఆర్డర్)కి సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని అంశాలనే బీఎన్ఎస్ఎస్‌లో కూడా కొనసాగించారు. దీనివల్ల విచారణాక్రమం(ట్రైల్ ప్రొసీజర్)కి సంబంధించిన చట్టాలు, పబ్లిక్ ఆర్డర్‌కు సంబంధించిన చట్టాలను, వాటిలోని వైవిధ్యతల కారణంగా విడివిడిగా పరిగణించాలా లేదా ఉమ్మడిగా పరిగణించాలా అన్న సందిగ్ధత నెలకొంది. ఈవిధంగా అనేక ప్రొవిజన్స్ అమలులో సందిగ్ధతలు ఉన్నాయి.
- ఒక నేరానికి సంబంధించిన ఆధారాలను సేకరించిన అధికారి స్థానంలో వచ్చిన మరో అధికారికి ఆ ఆధారాలను కోర్టుకు సమర్పించే అధికారాన్ని బీఎన్ఎస్ఎస్ కల్పించింది. అయితే ఆధారాలు సేకరించిన అధికారిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాన్ని ఇది దూరం చేస్తుంది.

ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-సీట్లు: బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

లోకేశ్ పేరిట ఒంటిమిట్ట ఆలయంలో ప్రత్యేక పూజలు


ఒంటిమిట్ట ఆలయంలో పూజలు నిర్వహించిన దివి లక్ష్మీ దంపతులు

మంగళగిరి, జూలై 21: కుప్పం నుంచి మంత్రి నారా లోకేశ్ చేసిన యువ గళం పాదయాత్ర విజయవంతం కావాలని, మంగళగిరి నుంచి లోకేశ్ భారీ ఆధిక్యంతో గెలుపొందాలని నియోజకవర్గ అంగన్‌వాడీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి దివి లక్ష్మీ దంపతులు గతంలో మొక్కుకున్నారు. తమ కోరికలు నెరవేరడంతో ఆదివారం కుటుంబ సమేతంగా ఒంటిమిట్ట కోదండ రామాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దివి పిచ్చియ్య, గుంటి ప్రతాప్, ప్రగడ భాస్కర్, నాగేంద్రబాబు, శివ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ తల్లికి మొక్కు తీర్చుకున్న నేతలు

తాడేపల్లి, జూలై 21: తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామ టీడీపీ నేతలు భావన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గంగానమ్మతల్లికి 101 కొబ్బరికాయలు కొట్టి ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. చంద్రబాబు గెలిచి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తే 101 కొబ్బరికాయలు కొడతామని మొక్కుకొని నేతలు ఆదివారం సదరు మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, కె.అంకినీడు, నామతోటి రాంబాబు, గుండిమెడ రమేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేద్దాం : ఎమ్మెల్యే నసీర్

మంగళగిరి సిటీ, జూలై 21: పేద, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఐక్యంగా కృషి చేద్దామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ గుంటూరు తూర్పులో తన గెలుపునకు కృషి చేసిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. శంకరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తన మూలాలను మర్చిపోకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, తుళ్లూరు హనుమంతరావు, మహమ్మద్‌ఖాన్, గుండ్ల శ్రీనివాస్, శివరాం బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

● సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య

తాడేపల్లి టౌన్, జూలై 21: రజకవృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణంలోని మేకా అమరారెడ్డి భవన్‌లో బొజ్జా సుబ్బారావు అధ్యక్ష తన జరిగిన ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం తాడేపల్లి, మంగళగిరి నగర మహాసభలో భాస్కరయ్య మాట్లాడుతూ రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. చిట్యాల ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నూతన కమిటీ అధ్యక్షుడిగా పార్థసారధి

మహాసభలో తాడేపల్లి మంగళగిరి రజక వృత్తిదారుల సంఘం నూతన కమిటి అధ్యక్ష కార్యదర్శులుగా ఉండవల్లి పార్థసారథి, పాగోలు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా మోర్తోట సుబ్బారావు, ఉపాధ్యాక్షులు బొజ్జం సుబ్బారావు, మరో 13మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆత్మకూరులో మహిళలకు వైద్య శిబిరం

మంగళగిరి, జూలై 21: గుంటూరు వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గర్భాశయ వ్యాధి నిర్ధారణ, ఇతర సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆలయాల్లో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

మంగళగిరి సిటీ, జూలై 21: గురు పౌర్ణమి వేడుకలను మంగళగిరి ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులకు సాయి మందిరాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చి బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్త బృందం ప్రతినిధులు సాయినాధుని సంకీర్తనలను ఆలపించారు. పెదవడ్లపూడి భగవాన్ శ్రీసత్య షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఏపీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జయలక్ష్మీ దంపతులు, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి దంపతులు, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఆర్యవైశ్య సంఘం నేత సంకా బాలాజీగుప్తా ప్రభృతులు సాయిబాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి పాతూరి శ్రీనివాసరావు, శీలం శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

● తాడేపల్లి, జూలై 21: మాజీ మంత్రి గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదివారం తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, దామర్ల రాజు, పాలెపు వీరేంద్రనాథ్, రామారావు, సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, జూలై 21: మండలంలోని పలు గ్రామాల్లోని షిర్డిసాయి మందిరాల్లోనూ, దత్తసాయి ఆలయాల్లోనూ గురుపూర్ణిమను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దుగ్గిరాల రైలుపేటలోని శ్రీషిర్డిసాయి పర్తిసాయి మందిరంలో సాయినాధునికి ఉదయం అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బాబాను దర్శించుకున్నారు. 2వేల మంది వరకూ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రేవేంద్రపాడు, కేఆర్‌కొండూరు, పెనుమూలి, చింతలపూడి, పెదకొండూరు, పేరుకలపూడి, చిలువూరు గ్రామాల్లోని శ్రీషిర్డి సాయిమందిరాల్లో గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా జరిపారు. 3వేల మంది వరకూ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రేవేంద్రపాడు జ్ఞానసాయిబాబాను దర్శించుకున్న వారిలో టీడీపీ నాయకులు నందం అబద్దయ్య, దామర్ల రాజు, జవ్వాది కిరణ్‌చంద్, తాళ్ల అశోక్‌యాదవ్, పూరేటి ఏసుబాబు, శైకం శివయ్య, చిట్టిబొమ్మ శ్రీనివాస రావు, కంచర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


పెదవడ్లపూడి సాయిబాబాను దర్శించుకున్న సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జయలక్ష్మీ దంపతులు


వట్టిచెరుకూరులో సాయిబాబాకి పూజలు చేస్తున్న మహిళలు

పెదనందిపాడు, జూలై 21 : మండల పరిధిలోని పెదనందిపాడు, ఉప్పలపాడు, ఏబీపాలెంలో సాయిమందిర్‌లో బాబా వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. భక్తులు స్వయంగా మూలవిరాట్‌లకు పాలభిషేకాలు చేశారు. గ్రామస్థులు దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక సాయిమందిర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఆదివారం దాతలు విరాళాలు అందజేశారు. పెదనందిపాడుకు చెందిన లావు సత్యనారాయణ, ద్రాక్షాయమ్మ దంపతులు రు.25వేల నగదును కమిటీ సభ్యులకు అందజేశారు.

తుళ్లూరు, జూలై 21: రాజధాని గ్రామాల్లో గురుపూర్ణిమ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తుళ్లూరు, వెంకటపాలెం, మందడం గ్రామాల్లోని సాయినాధుని మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

వట్టిచెరుకూరు, జూలై 21: మండలం పరిధి లేమల్లెపాడు, చింతపల్లిపాడు, ముట్లూరు, అనంతవర్పాడు సాయినాధుని మందిరాల్లో, వట్టిచెరుకూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురుపౌర్ణమి నిర్వహించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

● 24 మంది జూదరుల అరెస్టు

● రూ.3.12 లక్షల నగదు, 11 వాహనాలు, 24 ఫోన్లు స్వాధీనం

మంగళగిరి సిటీ, జూలై 21: మంగళగిరి మండలం కాజ గ్రామంలో గుట్టు గా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై స్పెషల్ బ్రాంచి, మంగళగిరి రూరల్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కాజ బైబిల్ మిషన్ ప్రాంగణం వెనుక మామిడి తోటల్లో కోతముక్క ఆడుతున్నట్టు సమాచారం రావడంతో ఆదివారం సాయంత్రం దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో 24 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,12,750 నగదు, రెండు కార్లు, రెండు ఆటోలు, 7 ద్విచక్ర వాహనాలు, 24 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

హోటల్ దగ్ధంపై కేసు నమోదు

పెదనందిపాడు, జూలై, 21: హోటల్ దగ్ధం చేసిన సంఘటనపై పోలీస్ స్టేషన్లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని జరుగులవారిపాలెంలో మౌలాబి, నాగూర్‌సాహెబ్‌లకు చెందిన హోటల్‌కు భీమవరంనకు చెందిన దుర్గారావు పెయింట్ పనులకు వచ్చి ప్రతిరోజూ టిఫిన్ చేసేందుకు హోటల్‌కు వచ్చేవాడు. దుర్గారావే నిప్పు అంటించాడని మౌలాబి ఫిర్యాదులో తెలిపింది. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ధరలకు కందిపప్పు విక్రయించాలి

తాడికొండ, జూలై 21: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కందిపప్పును దుకాణదారులు విక్రయించాలని తహసీల్దార్ మధుసూదనరావు పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే కందిపప్పు, బియ్యంను వినియోగదారులకు అందుబాటులో ఉంచే విధంగా తాడికొండలోని విజయదుర్గా సూపర్ మార్కెట్‌లో కౌంటర్‌ను తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కంది పప్పు కిలో రూ.160లు, స్టీమ్ బియ్యం కిలో రూ.49లు, ముడి బియ్యం కిలో రూ.48లకు అందుబాటులో ఉంచామన్నారు. కందిపప్పు, బియ్యం విక్రయాలపై నిత్యం సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పకుండా నిర్వహకులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో శర్మ, సీఎస్ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

● జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోటా వెంకటేశ్వరరెడ్డి

పెదనందిపాడు, జూలై 21 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విభజన హామీలను అమలు చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోటా వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఊరూరా జనవిజ్ఞానం ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో మూడు విజ్ఞప్తులపై రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసేందుకు మొదలైన ఘంటసాల కళాయాత్ర ఆదివారం పెదనందిపాడుకు చేరుకుంది.

పశ్చిమ డెల్టాకాల్వకు 300 క్యూసెక్కుల నీరు

● బ్యారేజి నుంచి దిగువకు 12,325 క్యూసెక్కులు

దుగ్గిరాల, జూలై 21: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 300 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 12,325 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 100 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 534 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ముత్యాల పందిరిలో మురిపించిన నృసింహుడు


ముత్యాల పందిరిపై గ్రామోత్సవంలో పాల్గొన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి

మంగళగిరి సిటీ, జూలై 21: మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు ఆదివారం రాత్రి ముత్యాల పందిరిలో మురిపించారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి శ్రీవారికి ముత్యాల పందిరి వాహన సేవ నిర్వహించారు. విజయవాడకు చెందిన యూవీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత డాక్టర్ అంగా ఉపేంద్రవర్మ ముత్యాల పందిరి వాహనాన్ని ఆలయానికి కానుకగా సమర్పించారు. ప్రతియేటా గురు పౌర్ణమినాడు నృసింహుడికి ముత్యాల పందిరి వాహనసేవ నిర్వహించడంతో పాటు బ్రహ్మోత్సవాల్లో ఈ వాహనానికి అవకాశం కల్పించారు. వరుసగా మూడో సంవత్సరం మత్యపు పందిరి వాహన సేవను వైభవంగా నిర్వహించారు. తొలుత శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన ముత్యాల పందిరిపై అర్చకులు అధిష్టింపజేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

దుగ్గిరాల ఎస్ఐగా వెంకటరవి


ఎస్ వెంకటరవి

దుగ్గిరాల, జూలై 21: దుగ్గిరాల ఎస్ఐగా సూరబోయిన వెంకటరవి బాధ్యతలను ఆదివారం స్వీకరించారు. ఇటీవలి వరకూ ఎస్ఐగా పనిచేసిన మహీంద్ర బదిలీపై వెళ్లారు. కాగా 2018 బ్యాచ్‌కు చెందిన వెంకటరవి గతంలో తుళ్లూరు, అడవులదీవిలోనూ పనిచేసిన బదిలీపై దుగ్గిరాల వచ్చారు.

జనసేన కార్యకర్తలకు పార్టీ ఆర్థిక సాయం


జనసేన కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఆ పార్టీ ప్రత్తిపాడు సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆర్థికసాయం అందించింది. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు మండలం కొప్పర్రుకు చెందిన రావూరి శ్రీనివాసరావు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడటంతో ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేల చెక్కుని రాష్ట్ర నాయకత్వం పంపించింది. అలానే మరో ప్రమాదంలో రావిపాడు గ్రామానికి చెందిన ఆకుల మస్తాన్‌రావు గాయపడటంతో ఆయనకు కూడా రూ.35 వేలను పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పంపించారు. ఈ రెండు చెక్కులను ప్రత్తిపాడు జనసేన సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు ఆదివారం వారి ఇళ్లకు వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఉప్పు వెంకటరత్తయ్య, డేగల లక్ష్మణ్, పావులూరి కోటేశ్వరరావు, నాగినేని సునీల్‌కుమార్, ఆముదాలపల్లి నరేంద్ర, రామిశెట్టి సురేష్ పాల్గొన్నారు.



బ్యాంక్ లాకర్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్, చైర్మన్ రాంబాబు తదితరులు

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల

తెనాలి, మారీసుపేట జూలై 20: బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక దేవీచౌక్‌లో ఆదివారం కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ 31వ శాఖను తెనాలిలో నూతనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు. నూతన శాఖను ఆలపాటి రాజేంద్రప్రసాద్ రిబ్బన్‌ను కట్‌చేసి ప్రారంభించగా, లాకర్‌రూమ్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన బ్యాంకు సేవలను అందించాలని, చిన్న సన్నకారు రైతులకు ఋణాలను అందించాలని, చిరు వ్యాపారులకు కూడా ఋణాలను అందించి వారి ఉన్నతికి సహకరించాలని కోరారు. బ్యాంకు చైర్మన్ కె రాంబాబు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా తమ బ్యాంకు సేవలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి, కుమార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, బ్యాంకు డైరెక్టర్ సీపీ రామారావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి కె శ్యామ్‌కిషోర్, శాఖ మేనేజర్ బి.వెంకటేశ్వరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన జీవో 117 రద్దు చేయాలి: చిట్టేటి రమేష్

తెనాలి అర్బన్, జూలై 21: విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన జీవో 117 రద్దు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ కోరారు. కొత్తపేటలోని ఎన్జీవో హోమ్‌లో ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా బీటీఏ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి బట్టు వెంకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక విద్యను ధ్వంసం చేసిందన్నారు. ఈ జీవో కారణంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేక మూతపడే స్థితికి చేరాయని, ఎన్నికల సమయంలో విద్యామంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను దశలవారీగా చెల్లించాలని కోరారు. ఆర్.మధుసూదనరావు, వేమయ్య, కిషోర్‌బాబు, ప్రసాద్, పూర్ణచంద్రరావు, సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐతానగర్‌లో దంత వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హిమబిందు, రవికుమార్ తదితరులు

తెనాలి, మారీసుపేట జూలై 20: స్థానిక ఐతానగర్‌లోని ది శాల్వేషన్ ఆర్మీ చర్చ్ ఆవరణలో ఆదివారం రక్షణ సైన్యం చర్చ్, బెస్ట్ డెంటల్ ఇంప్లాంట్ సెంటర్ వారు ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బెస్ట్ డెంటల్ ఇంప్లాంట్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ ఓగిరాల హిమబిందు పాల్గొని 100 మంది రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన రోగులకు వైద్య సలహాలను, ఉచిత మందులను టూత్‌పేస్టులను, మౌత్‌వాష్ లిక్విడ్‌లను, బ్రష్‌లను అందించారు. కార్యక్రమంలో సంఘకాపరి మేజర్ పి.నాగరాజు సీవో, మేజర్ రత్నసుందరమ్మ, సంఘ పెద్దలు గాలి రవికుమార్, బట్టు జక్రయ్య, పిల్లి కనకరత్నం, కారుమంచి నరసింహారావు, ఆశీర్వాదం, పీఆర్‌వో వీరస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాత కక్షలతో ఒకరిపై దాడి

తెనాలి, మారీసుపేట జూలై 20: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడిచేసిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఆదివారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుందరయ్య నగర్‌లో ఉన్న ఐతానగర్‌కు చెందిన దోమా రాకేష్‌పై యడ్ల లింగయ్య కాలనీకి చెందిన అబ్బూ అతని నలుగురు స్నేహితులు కర్రలతో దాడిచేసి గాయపరిచారని తెలిపారు. వీరికి గతంలో గొడవలు ఉన్న క్రమంలో రాకేష్‌పై, అబ్బూ కేసు పెట్టాడని, బాధితుడు రాజీకి రావాలని కోరుతున్నాడని, ఆ విషయంలో గొడవపడి కర్రలతో దాడిచేసి రాకేష్‌ను గాయపర్చారని తెలిపారు. బాధితుడు రాకేష్ ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.



ఆంజనేయ శర్మను సన్మానిస్తున్న పరిషత్ సభ్యులు

వేదమూర్తి ఆంజనేయ శర్మకు సత్కారం

తెనాలి అర్బన్, జూలై 21: స్థానిక కొత్తపేటలోని బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో వేదమూర్తి భాగవతుల ఆంజనేయశర్మను ఆదివారం ఘనంగా సన్మానించారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో ఆయనకు నూతన వస్త్రాలు, పండ్లు సమర్పించి ఆశీర్వాదం అందుకున్నారు. అధ్యక్షుడు కోటా పార్థసారధి మాట్లాడుతూ, వ్యాస మహర్షి జన్మించిన రోజు ఆషాఢ, గురు, వ్యాస పౌర్ణమిగా భావించి గురువులను పూజించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పరిషత్‌కు శాశ్వత భవనాన్ని నిర్మించేందుకు పేద బ్రాహ్మణులకు ఆర్థిక సహకారం అందించేందుకు ప్రతిజ్ఞరూ కృషి చేయాలన్నారు. చింతపల్లి సాయికిరణ్, మాచిరాజు రామకృష్ణ, రామచంద్రమూర్తి, శ్రీనివాస్, లక్ష్మణకుమార్, ఆంజనేయశాస్త్రి, ధనుంజయ్, శివకుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సమావేశం

తెనాలి అర్బన్, జూలై 21: స్థానిక కవిరాజా పార్కులో ఆదివారం వాకర్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ సీహెచ్ భానుప్రసాద్ తల తిరుగుట-చెవిలో మోత అనే అంశంపై ప్రసంగించారు. తల తిరగడానికి పలు కారణాలు, వినికిడి లోపం ఏర్పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు వివరించారు. కడియాల రవిబాబు, అచ్చయ్య, మొవ్వా సత్యనారాయణ, నరేంద్ర, ఆనందయ్య బొబ్బా వెంకటేశ్వరరవు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ భానుప్రసాద్‌ను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జూన్ 21: స్థానిక కొత్తపేట, గణేష్‌రావుపేటలోని సాయి బాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ, కృష్ణకుమారి పలు బాబా గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణ, తబలపై షణ్ముఖ శర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు నరసింహారావు సత్కరించారు.

వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

● భక్తులతో కిటకిటలాడిన బాబా మందిరాలు
● బాబా సంకీర్తనలతో మారుమోగిన మందిరాలు



బాబావారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న మాజీమంత్రి ఆలపాటి, రామకృష్ణ తదితరులు

తెనాలి, మారీసుపేట జూలై 20: పట్టణ పరిసర గ్రామాలలో సాయిబాబా మందిరాలలో గురుపౌర్ణమి వేడుకలును భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. స్థానిక మారీసుపేటలోని శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా బాబావారికి భక్తులు తెల్లవారుజామున కాకడ హారతితో బాబావారికి మేలుకొల్పి, ప్రత్యేక సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ బాబావారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్షుడు సీదా రామకృష్ణ, మందిర అర్చకులు జంధ్యాల రఘురామకృష్ణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● ఐతానగర్ శ్రీషిర్డిసాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 2000మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. రామలింగేశ్వరపేటలోని షిర్డి సాయిబాబా మందిరంలో గురుపూజామహోత్సవాలను శ్రీషిర్డి సాయిబాబా మందిర సేవా సమితి సభ్యులు ఘనంగా నిర్వహించారు. బాబావారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి వివిధ రకముల పుష్పాలతో అలంకరించి బాబా వారిని భక్తులు దర్శించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. నాజరుపేటలోని శ్రీషిర్డి సాయి బాబా మందిరంలో గురుపూజామహోత్సవాలను నిర్వహించారు. మందిరంలో నూతనంగా నిర్మించిన ధునిని రామలింగేశ్వరపేటలోని శ్రీషిర్డి సాయిబాబా మందిర ధుని నుండి అగ్నిని మేళతాళాలతో తీసుకొని వచ్చి ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట జూలై 20: మండల పరిధిలోని నందివెలుగు గ్రామంలోని శ్రీసాయి క్షేత్రంలో గురుపౌర్ణమి మహోత్సవాన్ని శ్రీషిరిడి సాయి స్వచ్ఛ సేవ ట్రస్ట్ వారు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సేవట్రస్ట్ చైర్మన్ హరిప్రసాద్, ట్రస్టీలు సుకుమార్, రాజా, శ్రీవల్లి, పార్వతి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం బాబావారిని మందిర కమిటీ సభ్యులు మేళతాళాలతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పొన్నూరులో....

పొన్నూరు టౌన్, జూలై 21: గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణ, మండలంలోని షిర్డిసాయి మందిరాల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని చింతలపూడి, పట్టణంలోని పాతపొన్నూరు షిర్డిసాయి మందిరాన్ని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని ఆలయ నిర్వాహకులు, అర్చకులు బాబా శేష వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయి మందిరాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువు కిషోర్‌కు ఘనంగా సన్మానం

తెనాలి అర్బన్, జూలై 21: ప్రముఖ యోగా గురువు కిషోర్ గురూజీని యోగా మండలి సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మారీసుపేట చంద్రమౌళేశ్వర కళ్యాణ మండపంలో పలు యోగా శాఖల ప్రతినిధులు ఆయనను సత్కరించారు. శ్రీఆంజనేయ ధ్యాన యోగా మండలి స్థాపించి తెనాలి, మంగళగిరి, గుంటూరు, బాపట్ల, రేపల్లె, చిలకలూరిపేట, పొన్నూరు, అంగలకుదురు, సోమసుందరపాలెంలో శాఖలను ఏర్పాటు చేసి తన శిష్యులతో యోగా ధ్యానం శిక్షణను వేలాది మందికి అందేలా కృషి చేస్తున్నారని 2వ అదనపు సివిల్ జడ్జి రాజశేఖర్ పేర్కొన్నారు. 50 మంది యోగా గురువులను సత్కరించిన కిషోర్ గురూజీ ఆయన భార్య సత్యలక్ష్మి జ్ఞాపకార్థం నర్సింగ్ సేవలు అందించిన కుమారి, సుధారాణి, నాగమణిలకు రూ.6 వేలు నగదు పంపిణీ చేశారు. తండ్రి ఆంజనేయులు జ్ఞాపకార్థం దుకాణాలలో గుమాస్తాగా పనిచేస్తున్న జ్యోతి, రత్నకుమార్‌లకు రూ.10232లు బహుకరించారు. అన్నతరం 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజారెడ్డి, శోభనాద్రి, హరనాథ్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగరాజు, కోమల తదితరులు పాల్గొన్నారు.



కిషోర్ గురూజీని సన్మానిస్తున్న యోగా సభ్యులు

● తెనాలి, మారీసుపేట జూలై 20: నాజరుపేటలోని వెల్లంకి వారి వీధిలో ఆదివారం షిరిడి సాయినాధుని మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా మందిర కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం బాబావారికి పల్లకి సేవను భక్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరిశెట్టి శివనాగమల్లేశ్వరి భాస్కరరావు, మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● కొల్లిపర, జూలై 21: గురుపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రం కొల్లిపర శ్రీ షిర్డీసాయి బాబా మందిరంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. శ్రీ సాయి సత్యవ్రత కల్పాన్ని భక్తులతో చేయించారు. సుమారు 125 మంది మహిళలు సామూహికంగా వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పండితులు కుమారస్వామి, కుటుంబరావు సాయినాథుడి వృత్తాంతాన్ని వివరించారు. 5వేల మందికి కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గుదిబండి చినవెంకటరెడ్డి, కల్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, భీమవరపు శివారెడ్డి, జొన్నల శివారెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, గుడ్‌విల్ కృష్ణారెడ్డి, ఆరిమండ బసవకుటుంబరెడ్డి పర్యవేక్షించారు. ఇదేవిధంగా మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, తూములూరు, సిరిపురం, అత్తోట గ్రామాల్లోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.

● తెనాలి అర్బన్, జూలై 21: పట్టణంలోని షిరిడి సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మారీసుపేటలో శివాలయం పక్కన ఉన్న సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వారం రోజుల సప్తాహ మహోత్సవాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీదా రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు.

అర్చకులు రఘురామశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీ సాయిబాబా ప్రధాన దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆలయాన్ని పూలతో అలంకరించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

● భూగర్భ మురుగునీటి వ్యవస్థ(యూజీడీ) ఏర్పాటుపై కసరత్తు
● అమృత్, హట్కో ద్వారా నిధుల సేకరణకు ప్రణాళికలు
● టౌన్ ప్లానింగ్ విధివిధానాలపై ఆరోపణలు
● మున్సిపల్ అధికారులతో పెమ్మసాని ప్రత్యేక సమావేశం

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): 'ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాల్సిందే. భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ), డివైడర్లు, పార్కులు, ట్రాఫిక్ కూడళ్లలో బ్యూటిఫికేషన్ వంటి ఏర్పాట్లు త్వరగా జరగాలి' అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. కొద్ది రోజుల క్రితం నగరాభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలపై కార్పొరేషన్ అధికారులతో ఆయన తన కార్యాలయంలో ఆదివారం పునఃసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో యూజీడీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తక్షణమే యూజీడీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, బ్యూటిఫికేషన్ అంశాలపైనా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి నిధుల సేకరణకు తన వంతు కృషి చేస్తానన్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రహదారులకు ప్యాచ్ వర్క్ చేయాల్సిన బాధ్యతను నగరపాలక సంస్థ తీసుకోవాలని, ఆ దిశగా ఇంజనీరింగ్ అధికారులు పనిచేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్‌పై ఎన్నో ఆరోపణలు ఉన్నాయని, తక్షణమే విధివిధానాలపై మార్పులు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో సిటీ టౌన్ ప్లానర్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలి

● 'ఐలు' రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు

గుంటూరు (తూర్పు), జూలై 21: విస్తృతమైన చర్చలు, సంప్రదింపులు చేయకుండా అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాల ని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు అన్నా రు. ఆదివారం, బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎల్‌బీసీ ఎంప్లా యీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్ అధ్యక్ష తన 'క్రిమినల్ చట్టాలు-ప్రజలకు శాపాలు' అనే అంశంపై స్టడీ సర్కిల్ జరిగింది. ఈ సందర్భంగా నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన చట్టాల నిబంధనలు పోలీసు లకు నిరంకుశ అధికారాలను కల్పిస్తున్నాయని వివరించారు. ఈ చట్టాల అమలును నిలిపివేయాలని సుమారు 3600 మంది వివిధ రంగాల ప్రముఖుల విజ్ఞప్తిని పరిశీ లించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఇంజనీర్ జి.వెంకట్రావు, ప్రొఫెసర్ ఎన్ వేణుగోపాలరావు, అవధానుల హరి, వై నేతాజీ, కే పద్మ, షకీలా బేగం పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలి

● రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గుంటూరు (విద్య), జూలై 21: రాష్ట్రంలో పెన్షనర్ల సమస్యలు కొత్త ప్రభుత్వం సాను కూలంగా పరిష్కరించే లా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం పూర్తి స్థాయిలో కుదురుకున్న వెంటనే సీఎం చంద్రబాబుకు ఆయా సమస్యలు విన్నవించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం తాలుకా ఆవరణలోని పెన్షనర్స్ హోమ్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా 11వ పీఆర్‌సీలో తగ్గించిన అదనపు క్వాంటం తిరిగి పునరుద్ధరించడం, పీఆర్‌సీ, డీఆర్ బకాయిలు సాధించేలా జేఏసీతో కలిసి పని చేస్తామన్నారు. కోశాధి కారి టీపీఎస్ ఆర్పీ శర్మ, సహాధ్యక్షుడు జీఎస్ అబ్దుల్ కరీం, రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభు దాసు పదవీ విరమణ పొందిన వారిని సభ్యులుగా చేర్చుకో వాలని సూచించారు. జిల్లా, మండల, తాలుకా యూనిట్లు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. తొలుత నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణకు సంఘం తరఫున శుభాకాంక్షలు తెలిపారు.

క్యాంటీన్‌ను మాజీ సైనికులు సద్వినియోగం చేసుకోవాలి

● కమిటీ చైర్మన్ కల్నల్ చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), జూలై 21: ఉమ్మడి గుంటూరు జిల్లాల మాజీ సైనికుల కోసం క్యాంటీన్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చినట్టు క్యాంటీన్ కమిటీ చైర్మన్ కల్నల్ ఎస్ ఏం చంద్రశేఖర్, ఎన్‌సీసీ కల్నల్ సాజల్ కాంత్‌దాస్ తెలిపారు. స్థానిక శ్యామలానగర్, ఎన్‌సీసీ, సీఎస్‌డీ క్యాంటీన్ ఆవరణంలో నూతనంగా నిర్మించిన కౌం టర్లను మాజీ సైనికులు విష్ణుబొట్ల రాజారామ్‌తో కలిసి వారు ఆదివారం ప్రారంభించారు. అనంతరం కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ మాట్లా డుతూ క్యాంటీన్ ఆవరణలో ఏర్పాటు చేసిన నిర్మాణాలు, వైజాగ్ క్యాంటీన్ స్టోర్స్‌తో చేస్తున్న లావాదేవీలు, మాజీ సైనికుల కోసం వివిధ పేర్లతో ఏర్పాటు చేసిన గ్రోసరీ సదుపాయాలను సులభతరంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు ఆళ్ల రాఘవరావును ఆయన సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ సైనికుల లీగ్ (ఐఈఎస్ఎల్) ముఖ్య కార్యదర్శి రెడ్డి శ్రీనివాస వరప్రసాద్, రాష్ట్ర సమీకృత త్రిదళ మాజీసైనికుల కమిటీ ముఖ్య కార్యదర్శి కాలేషా, క్యాంటీన్ మేనేజర్ విశ్రాంత కల్నల్ ఉప్పల వెంకటేశ్వర్లు, సుదాకర్, ఫణి పాల్గొన్నారు.

ఏం ఘనకార్యం చేశాడని జగన్ ఢిల్లీ పర్యటన

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్

గుంటూరు, జూలై 21: ఏం ఘనకార్యం చేశాడని జగన్ ఢిల్లీ పర్యటనకు వెళుతున్నాడని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. హింస, విధ్వంసం, అరాచకం, అన్యాయం, అవినీతి గురించి జగన్‌రెడ్డి మాట్లాడటం రోత పుట్టిస్తుందన్నారు. బాధితులనే నిందితులను చేసి ప్రభుత్వం టెర్రరిజానికి పాల్పడిన ఆ చీకటి రోజులు రాష్ట్రంలో పోయి నెల దాటిందన్నారు. కూటమి ప్రభుత్వం మిగిలిన అరాచకపు ఆనవాళ్లను కూడా కూకటి వేళ్లతో పెకిలించి వేస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రజల రక్షణకు కట్టుబడి ఉందని, ఎటువంటి ఘటనలను కూడా ఉపేక్షించేది లేదన్నారు. ఎంతటి వారినైనా వదిలేదిలేదన్నారు. తమది ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజా ప్రభుత్వమన్నారు. ప్రజాపాలన, అవినీతిరహిత పాలనే లక్ష్యంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అడుగులు వేస్తున్నారన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూలై 21: స్థానిక గోరంట్ల నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ పాఠశాల ఇండోర్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ జట్ల ఎంపికలు ముగిశాయి. ఎంపికైన క్రీడాకారులు కర్నూలు జిల్లాలో ఆగస్టులో 10, 11 తేదీలతో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ కార్యదర్శి తిరుపతిరావు తెలిపారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అయ్యన్ ఫౌండేషన్ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది ఇంద్ర శేఖర్‌రెడ్డి, పాఠశాల పీఈడీ హెచ్‌వోడీ కిషోర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు సభ్యులు ఇమ్మానియేలురాజ్, పీఈటీలు వాసంతి, లక్ష్మి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెదకాకాని భ్రమరాంబ అమ్మవారికి ఆషాడ పట్టీని మోసుకొస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్

శాకాంబరీదేవిగా పెదకాకాని భ్రమరాంబ అమ్మవారు

● ఆషాడపట్టీ తెచ్చిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పెదకాకాని, జులై 21: పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం శాకాంబరీదేవిగా శ్రీభ్రమరాంబను ప్రత్యేక అలంకంగా అలంకరించారు. స్వామివారి ముఖ మండపం, ఆలయ ప్రాంగణంను వివిధ రకాల కూరగాయలతో సుందరంగా అలంకరించినారు. భక్తులు పెద్ద సంఖ్యలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు కదంబ ప్రసాద వితరణ చేశారు. శాకాంబరీ అలంకారంనకు ఆకుకూరలు, కూరగాయలు పెదకాకానికి చెందిన వీరిశెట్టి లక్ష్మీనారాయణ అందజేసినట్లు ఉపకమీషనరు తెలిపారు.

శివయ్య సన్నిధిలో నరేంద్రకుమార్ పూజలు

శ్రీ భ్రమరాంబ అమ్మవారికి అషాఢసారెను ఆదివారం పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తీసుకునివచ్చారు. భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. దేవస్థాన ఉపకమిషనరు దాసరి శ్రీరామవరప్రసాదరావు దేవాలయ మర్యాదలతో ఆలయ అర్చకస్వాములు, వేదపండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో సాదర స్వాగతం పలికారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారికి సమర్పించు సారెతో ఆలయ ప్రదక్షణలు అనంతరం ప్రత్యేక అభిషేకాలు, పూజలలో పాల్గొన్నారు. పండితులు, వేద ఆశీర్వచనం అనంతరం శ్రీస్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి దివ్య ప్రసాదం, చిత్రపటంను శాసనసభ్యుడు శ్రీధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు ఆలయ ఉపకమీషనరు డి.శ్రీరామ వరప్రసాదరావు అందజేశారు.

పొన్నూరు పట్టణంలో చోరీ

పొన్నూరు టౌన్, జూలై 21: పొన్నూరు పట్టణంలో బంగారం పనిచేసే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. బాధితుడు షేక్ గౌస్‌పీర్ పట్టణంలోని 5వ వార్డు డఫ్‌పేటలో నివసిస్తున్నాడు బంగారు నగల తయారీ పనిచేసే గౌస్ పీర్ శుక్రవారం కుటుంబంతో సహా నెల్లూరు రొట్టెల పండగకు వెళ్లాడు. ఆదివారం గౌస్ పీర్ కుటుంబ సభ్యులు నెల్లూరు నుంచి తిరిగి వచ్చి ఇంటిలో భద్రపరిచిన 14సవర్ల బంగారు, రూ.4.60 లక్షల నగదు చోరీ జరిగినట్లు గుర్తించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ పోలీసులు చోరీపై కేసు నమోదు చేసి దరాప్తు ప్రారంభించారు.



తులసి రామచంద్ర ప్రభుని సత్కరిస్తున్న అధ్యాపకులు

వివాలో ముగిసిన ఐక్యరాజ్యసమితి నమూనా సదస్సు

పెదకాకాని, జూలై 21: వివాది స్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఐక్యరాజ్యసమితి నమూనా సదస్సు ఆదివారంతో ముగిసింది. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ సమస్యలపై చర్చించి తమదైన పరిష్కారాలలో ప్రకటించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యారు. ఈ సదస్సులో చర్చలో పాల్గొన్న విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ప్రపంచస్థాయి పౌరులుగా ఎదిగేందుకు విద్యార్థులు దేశ అంతర్జాతీయ విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చదలవాడ సరళ డైరెక్టర్ కమాండర్ కే శ్రీనివాసరావు అధ్యాపకులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారికి అలంకారం



శాకంబరి అలంకారంలో అమ్మవారు

తెనాలి అర్బన్, జూలై 21: ఆషాడ మాసం పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాలలో అమ్మవార్లను ఆదివారం శాకంబరీ దేవిగా అలంకరించారు. మారీసుపేటలోని శ్రీచంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో బాలత్రిపుర సుందరి అమ్మవారు, గంగానమ్మపేట పాతశివాలయంలో పర్వతవర్ధిని అమ్మవారు, శ్రీవాసవీ ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకారం గావించారు. భక్తులు పెద్దల సంఖ్యలో అమ్మవారిని దర్శించి ప్రార్థించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సాయిబాబా మందిరం కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు

క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలి

● సాయిబాబా మందిరం చైర్మన్ శ్రీనివాసరావు

కొల్లిపర, జూలై 21: విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సాయిబాబా మందిరం కమిటీ చైర్మన్ గన్నిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అత్తోట సాయిబాబా మందిరంలో గన్నిశెట్టి శ్రీనివాసరావు తన తండ్రి కోటేశ్వరరావు జ్ఞాపకార్థం పదో తరగతిలో లక్ష్మీపూజిత, మేఘన, నాగసత్యంలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించడంతో వారికి గ్రామ పెద్దలతో కలిసి రూ. 12వేలు నగదుతో పాటు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బసవలింగప్రసాద్, ఉపాధ్యాయులు శివనాగేశ్వరరావు, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు దాసరి నరసయ్య, దివ్వెల వెంకయ్యనాయుడు, యర్రు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు

గుంటూరు, జూలై 21: స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేటకు చెందిన ఒక యువతిని ప్రేమ పేరుతో మోసంచేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె నగరంలోని ఓ ప్రైవేట్ టెలికం కంపెనీలో పని చేస్తుంది. అదే కంపెనీలో అంకిరెడ్డిపాలేనికి చెందిన ఓర్సు శివకృష్ణ కూడా పనిచేస్తున్నాడు. ఏడాదిన్నరగా వారిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఇటీవల పెళ్లి చేసుకోమంటే శివకృష్ణ నిరాకరించడంతో బాధితురాలు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శివకృష్ణపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.